శనివారం, హైదరాబాద్
20.01.2024
సంపుటి:2 సంచిక:90

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

## తెలంగాణ గవర్నర్ 'ఎక్స్' ఖాతా హ్యాక్..
# ఐపీ అడ్రస్‌ల గుర్తింపు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

తెలంగాణ గవర్నర్ తమిళిసై ఎక్స్ ఖాతా ఈనెల 14న హ్యాక్ అయిన విషయం తెలిసిందే. రాజ్‌భవన్ అధికారుల ఫిర్యాదు మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇండియాలోని మూడు ఐపీ అడ్రస్‌ల నుంచి ఆపరేట్ అయినట్టు గుర్తించారు. హాత్‌వే, యాక్ట్ సహా మరో ఇంటర్నెట్ సర్వీసు ద్వారా గవర్నర్ ఖాతాను హ్యాక్ చేసేందుకు ప్రయత్నించారని నిర్ధరించిన పోలీసులు.. ఐపీ అడ్రస్‌ల వివరాలు పంపాలని సర్వీస్ ప్రొవైడర్లను కోరారు. వివరాలు అందగానే నిందితులను పట్టుకుంటామని సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపారు.

## రీ అపాయింట్‌మెంట్
# ఆఫీసర్లు అవుట్!

- రిటైర్డ్ ఎంప్లాయీస్‌పై ప్రభుత్వం ఫోకస్
- పూర్తయిన ఉద్యోగుల వివరాల సేకరణ
- వంద మందికి పైగా రిటైర్డ్ ఆఫీసర్లు..
- ఇంటికి పంపించేందుకు రంగం సిద్ధం
- సీఎం రాగానే ఆయన చేతికి తొలగింపు లిస్ట్
- సెక్రటేరియట్ లోనే ఐదుగురు ఐఏఎస్ లు
- ఇరిగేషన్ శాఖలోనే ఎక్కువ మంది తిష్ట
- రెండో స్థానంలో పంచాయతీ రాజ్ శాఖ



**ఫార్మాట్ ఇదే..**

1. సదరు ఉద్యోగి రిటైర్ అయింది. ఎప్పుడు? వారి పేరు
2. రిటైర్డ్ అయ్యే నాటికి వారి హోదా ఏంటి?
3. ఇప్పుడు ఏ శాఖలో కొనసాగుతున్నారు?
4. రీ అపాయింట్ అయింది ఎప్పుడు?
5. వారు ఏ హోదాలో కొనసాగుతున్నారు?
6. ఇంకా ఎంత కాలం కొనసాగేలా ఉత్తర్వుల్లో మెన్షన్ అయింది?
7. ఇతర వివరాలేమైనా ఉంటే తెలియజేయవచ్చు.

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

గత ప్రభుత్వ హయాంలో పదవీ విరమణ పొందినా.. రీ అపాయింట్ అయి ఇంకా కాంట్రాక్టు/ ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఆఫీసర్లను ఇంటికి పంపించేందుకు తెలంగాణ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వివరాల సేకరణకు ఒక నిర్దిష్టమైన ఫార్మాట్ రూపొందించి.. అన్ని డిపార్ట్‌మెంట్లు, విభాగాలు, కార్పొరేషన్లు, ఏజెన్సీలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సర్క్యులర్ జారీ చేశారు. అదే ఫార్మాట్‌లో దాదాపు 100 మంది అధికారుల లిస్ట్ ఇప్పటికే సీఎస్‌కు చేరాయి. దీంతో తెలంగాణ ప్రభుత్వంలో వివిధ శాఖల్లో ఉన్నత అధికారుల నుంచి వేర్వేరు స్థాయిల్లో పని చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులకు టెన్షన్ పట్టుకుంది. గత ప్రభుత్వంలో చాలా డిపార్ట్‌మెంట్లలో రిటైర్డ్ ఉద్యోగులు రీఅపాయింట్ మెంట్ కొనసాగుతున్నారని ఎన్నికల ప్రచారం సమయంలో కాంగ్రెస్ ఆరోపించింది. ఇలాంటి వారందరినీ అధికారంలోకి వచ్చిన తర్వాత విధుల నుంచి తొలగిస్తామని చెప్పింది. ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఒకటిన్నర నెల రోజులు అవుతున్న సందర్భంగా వివరాలు సేకరించడంపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ ఉద్యోగిగా రిటైర్డ్ అయిన తర్వాత కూడా రీ అపాయింట్మెంట్ అయిన సిబ్బందికి సంబంధించిన పలు వివరాలను నిర్దిష్ట ఫార్మాట్లో తెప్పించుకుంటున్నది. ఆ ప్రకారం పదవీ విరమణ పొందినా ఇంకా సర్వీసులో ఏదో ఒక పేరుతో కొనసాగుతున్నవారిని గుర్తించే ప్రాసెస్‌ను మొదలుపెట్టింది.

**సీఎస్‌కు చేరిన వంద మంది లిస్ట్!**

పదవీ విరమణ పొందిన అధికారుల జాబితా సీఎస్‌కు చేరింది. రాష్ట్రం మొత్తం మీద వంద మందికిపైగా రిటైర్డ్ అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీళ్లలో ఇరిగేషన్‌డిపార్ట్‌మెంట్‌లో

..మిగతా 2 లో



# దావోస్ టూర్ గ్రాండ్ సక్సెస్

- రూ.40,232 కోట్ల పెట్టుబడులు
- 200 సంస్థలతో సంప్రదింపులు..
- గత ప్రభుత్వం కంటే 'డబుల్' రిజల్ట్స్
- లండన్ చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
- థేమ్స్ రివర్ పాలక మండలితో చర్చలు
- రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు సహకారం
- మూసీ పునరుజ్జీవానికి థేమ్స్ ప్లాన్

> "తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు రాబోతున్నాయి. ఇన్వెస్టర్లను ఆకర్శించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు ఫలించాయి. తెలంగాణకు భారీ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా దావోస్ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి టీమ్.. రూ.40,232 కోట్ల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నారు. 3 రోజుల పర్యటనలో వివిధ కంపెనీలకు చెందిన 200 మంది ప్రతినిధులతో సమావేశమయ్యారు. గత ఏడాదిలో వచ్చిన పెట్టుబడులతో పోలిస్తే ఈసారి రెండింతలు పెరిగాయి.

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దావోస్ పర్యటన విజయవంతమైంది. తెలంగాణలో రూ. 12,400 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు అదానీ గ్రూప్ ముందుకు వచ్చింది. నాలుగు రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో అదానీ గ్రూప్ అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ సంస్థ, ఇంధన రంగంలో ఐదువేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడతామని అదానీ హామీ ఇచ్చారు. అదానీ గ్రూప్ తోపాటు, జేఎస్‌డబ్ల్యూ, వెబ్ వర్క్స్, టాటా టెక్నాలజీస్, బీఎల్ఆగ్రో, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ గ్రూప్ హోల్డింగ్స్, గోడీ ఎనర్జీ, అరజెన్ లైఫ్ సైన్సెస్, ఇన్నోవెరా ఫార్మాస్యూటికల్స్, క్యూ సెంట్రియో, సిస్ట్రా, ఉబర్, ఓ9 సొల్యూషన్స్ తదితర కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి సంసిద్ధతను వ్యక్తం చేశాయి. జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ తెలంగాణలో ఏకంగా రూ.9,000 కోట్ల పెట్టుబడితో 1,500 మెగావాట్ల విద్యుత్‌ఉత్పత్తి సామర్థ్యంగల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. సీఎం రేవంత్‌తో జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ సమావేశమైన అనంతరం ఈ మేరకు ఒప్పందం చేసుకున్నారు. ఇక గోడి ఇండియా ప్రైవేట్

..మిగతా 2 లో



## దోపిడీని చూసి
# కడుపు తరుక్కుపోతోంది

- రూ.9వేల కోట్లు ఖర్చు చేసి ఒక్క ఎకరాకు నీళ్లివ్వలే
- రాష్ట్రాన్ని కాపాడడానికి ప్రజలు సహకరించాలి
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఫైర్
- ఇరిగేషన్ శాఖను ధ్వంసం చేశారు

..మిగతా 2 లో

## పెత్తందారులకు
# దళితులంటే చులకన

- పోరాటానికి రూపమే అంబేద్కర్
- రాష్ట్రాన్ని దోచుకోవడమే పెత్తందారుల లక్ష్యం
- బీసీ, ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబుకు ఏ కోశానా ప్రేమలేదు
- ఏపీ సీఎం జగన్



**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్:**

పోరాటానికి రూపమే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తించారు. పెత్తందారుల పత్రికలు చరిత్రను కూడా వక్రీకరిస్తున్నాయని, ఎల్లో మీడియాను చూస్తే పాత్రికేయం ఏ స్థాయికి దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సామాజిక సమతా సంకల్ప సభలో మాట్లాడుతూ పేదవాడి పిల్లలు ఎప్పటికీ పనివాళ్లుగా ఉండిపోవాలా? అంటూ ప్రశ్నించారు. పేదలు చదివే ప్రభుత్వ స్కూళ్లను పట్టించుకోకపోవడం అంటరానితనమే. పేదలకు ఇళ్లు ఇస్తుంటే అడ్డుకోవడం కూడా అంటరానితనమే. పేదపిల్లలకు

..మిగతా 2 లో



## కన్ స్ట్రక్షన్ యూనివర్సిటీని
# ఏర్పాటు చేస్తాం

- ప్రతి మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్
- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- న్యాక్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌కు హాజరు

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్లను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కొత్తగూడలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ క్యాంపస్ లో నిర్వహించిన 45వ న్యాక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. న్యాక్ వైస్ చైర్మన్ అయిన కోమటిరెడ్డితో పాటు సీఎస్ శాంతి కుమారి, ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్ రాజులు కూడా హాజరయ్యారు. ఈ సమావేశం అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఫ్యూచర్ కన్స్ట్రక్షన్ అకాడమీతోపాటు స్కిల్ డెవలప్ మెంట్ సెక్టార్స్, ఓల్డ్ డిస్ట్రిక్ట్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేయాలంటుకొంటున్నామని తెలిపారు. అలాగే, కన్స్ట్రక్షన్ యూనివర్సిటీ ప్రపోజల్ కూడా వుందని.. దీనిపై ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రతి జిల్లా హెడ్ క్వార్టర్స్ లో 10వేల మందికి టీఎస్సీ ద్వారా ట్రైనింగ్ ఇస్తామని చెప్పారు. ఒకేషనల్, పాలిటెక్నిక్, ఐటిఐ కాలేజీల వారికి టెక్నికల్ గా సపోర్ట్ చేయడం కోసం సుదీర్ఘంగా చర్చించామన్నారు. న్యాక్ ప్రాపర్టీ మిస్ యూజ్ అవ్వకుండా, లీజ్ తీసుకున్నవారు ప్రాపర్ గా ఉపయోగించుకునే విధంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ కి ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చామని తెలిపారు.

**గత ప్రభుత్వం తప్పుడు ప్రచారం..**

గత ప్రభుత్వం పేపర్లలో ఫోటోలు, టీవీల్లో స్టేట్మెంట్లు తప్పా ఎక్కడా నిజాల్ని వెల్లడించలేదని మంత్రి విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎక్కడా చట్టబద్ధమైన పాలన సాగలేదని ఆరోపించారు. దుబాయ్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తప్పుడు ప్రచారం చేశారని.. దుబాయ్ కంపెనీతో ఎలాంటి ఎంవోయూ కాలేదని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్స్ ఏర్పాటుపై సీఎంతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందులో కమర్షియల్ యాక్టివిటీస్ జరిగితే చర్యలు తీసుకుంటామని.. ఓన్లీ ట్రైనింగ్ సెంటర్ పర్పస్ గా ట్రైనింగ్ డెవలప్మెంట్ ప్రోగ్రాంతో ప్రతీ సంవత్సరం రెండు లక్షల మందికి శిక్షణ ఇస్తామని చెప్పారు. నిరుద్యోగుల కోసం మండలానికొక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తామన్నారు. అందులో భాగంగా మొదటిగా మహబూబ్ నగర్ లేదా నల్గొండ జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలనుకొంటున్నామని మంత్రి వెంకట్ రెడ్డి చెప్పారు. ఇదే సమావేశంలో

..మిగతా 2 లో



# తెలంగాణ'ను చంపే కుట్ర

- కాంగ్రెస్ ఆ ఊసే మరిచిపోయేలా చేస్తోంది
- తెలంగాణ అస్తిత్వం మరుగవుతోంది
- తుమ్మల రుణాలు వసూలు చేయమంటున్నాడు
- రైతు రుణమాఫీ ఏమైనట్టు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

కాంగ్రెస్ పార్టీపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చింది ఆరు గ్యారెంటీలు కాదు.. అవి 420 హామీలు అని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. 'గవర్నర్ ప్రసంగంలో తెలంగాణ గుళ్ళ అయ్యిందని, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విఫలం అయ్యిందని అబద్ధాలు మాట్లాడించారు. అందుకే శ్వేద పత్రం విడుదల చేశాం. తెలంగాణ సమగ్ర అభివృద్ధిని పొందుపరిచాం. గణాంకాలు, ఆధారాలతో సహా వివరించాం. అధికారంలోకి వచ్చాక డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తా.. రూ. 2 లక్షల రుణం తెచ్చుకోండి అని పీసీసీ అధ్యక్షుడి

..మిగతా 2 లో

# దోపిడీని చూసి కడుపు తరుక్కుపోతోంది

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

గత పాలకుల హయాంలో తెలంగాణలో జరిగిన దోపిడీ నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం గట్టెక్కాలంటే ప్రజల సహకారం అవసరమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఇరిగేషన్ శాఖపై డిప్యూటీ సీఎం, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సెక్రటేరియట్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్రం తెచ్చుకుందే నీళ్ల కోసమని, దుమ్ముగూడెం రాజీవ్ సాగర్ వ్యయం రూ.1,681కోట్లు కాగా.. రూ.889 కోట్లు 2014 కంటే ముందే ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. ఇందిరా సాగర్ వ్యయం రూ.1824 కోట్లు కాగా.. 1064 కోట్లు ఖర్చు చేశారన్నారు. రెండు ప్రాజెక్టులకు మిగతా రూ.1552 కోట్లు ఖర్చు చేస్తే 4లక్షల ఎకరాలకు నీరు అందేదని ఆయన వెల్లడించారు. సీతారామ ప్రాజెక్టు అని పేరు చెప్పి 18500 కోట్లకు కేసీఆర్ ప్రభుత్వం అంచనా వ్యయం పెంచిందని.. కానీ కొత్త ఆయకట్టు లేదని మంత్రి తీవ్రంగా మండిపడ్డారు. సీతమ్మ బ్యారేజీకి నీటిని అందించేందుకు రూ. 3,486 కోట్లకు ప్రాజెక్టు ఖర్చు అంచనా వేయగా.. కానీ మొత్తం రూ.4,481కోట్లు ఖర్చు చేశారన్నారు. రీడిజైన్ పేరుతో ఒక్క ఎకరానికి నీరు అందివ్వ లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి మూడు సంవత్సరాల్లో సంవత్సరానికి రూ.500 కోట్లు ఖర్చు చేస్తే వేల ఎకరాలకు నీరు వచ్చేదన్నారు. దోపిడీ నుంచి రాష్ట్రాన్ని కాపాడటానికి ప్రజల సహకారం అవసరమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. ఈ రకంగా దోపిడీ జరుగుతూ ఉంటే చూస్తే ఊరుకుంటే కడుపు తరుక్కు పోతుందన్నారు.

## త్వరలో సీతారామ ప్రాజెక్టును విజిట్‌చేస్తాం

- ఇరిగేషన్ శాఖను ధ్వంసం చేశారు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రెండు మూడు రోజుల్లో సీతారామ ప్రాజెక్టుల సందర్శనకు మంత్రులందరం వెళతామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు తాము ఏదో చేస్తున్నామని భ్రమలు కల్పించారని ఆయన మండిపడ్డారు. రూ. 1500 కోట్లతో పూర్తి అయ్యే ప్రాజెక్టులు 2981 కోట్లకు అంచనా వ్యయం పెంచారన్నారు. ఇరిగేషన్ మంత్రిగా నేనే నిర్ఘాంత పోయా.. ఇరిగేషన్ శాఖను ధ్వంసం చేశారని, 94 వేల కోట్లు ఖర్చు చేస్తే కాళేశ్వరంలో లక్ష ఎకరాలకు నీరు ఇవ్వలేదన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో నీటి వాటాలో ఒక చుక్క ఎక్కువ తీసుకువచ్చారా? అని ఆయన ప్రశ్నించారు. జాతీయ ప్రాజెక్టులకు 60 శాతం నిధులు కేంద్రం ఇస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులకు జాతీయ హోదా కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం సరైన ఫార్మాట్‌లో అప్లై చేయలేదని, జాతీయ హోదా అనే అంశం రాజకీయాల కోసం బీఆర్ఎస్ నేతలు మాట్లాడారని, జాతీయ హోదా అనేది దేశంలో ఎక్కడా లేదని కేంద్ర జలశక్తి మంత్రి తేల్చి చెప్పారన్నారు. జాతీయ హోదా కాకుండా ఇతర మార్గాల్లో 60 శాతం నిధులు ఇస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని, ఇప్పుడు జాతీయ హోదా గురించి మాట్లాడటానికి హరీశ్‌కు సిగ్గూ శరం ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. కేఆర్ఎంబీకి ఏ ప్రాజెక్టు అప్పగించడానికి మేము ఒప్పుకోలేదని ఆయన మండిపడ్డారు. రాజకీయం చేయను అనుకుంటూనే హరీశ్ రాజకీయాలు మాట్లాడాడని, కేఆర్ఎంబీకి రాష్ట్రంలోని ప్రాజెక్టులు అందివ్వలేదన్నారు. కృష్ణా నది పై ఉన్న ప్రాజెక్టులపై కేంద్రం చర్చలు జరిపింది. దీనిపై తెలంగాణ ఎలాంటి సమాధానం చెప్పలేదని, మేము కేంద్రం చెప్పిందనికి అంగీకారాన్ని తెలుపలేదన్నారు. కృష్ణ వాటర్ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కి ఉందా? అని ఆయన ప్రశ్నించారు. మీరు జగన్మోహన్ అలై బలై తీసుకున్నారు. సంగమేశ్వర ప్రాజెక్టు ద్వారా జగన్ కృష్ణా నీటిని తీసుకు వెళ్తున్న ఒక్కసారి కూడా మాట్లాడలేదు. హైదరాబాద్ లో గంటలు గంటలు జగన్మోహన్ రెడ్డితో మీరు ఏకాంత చర్చలు జరిపారు. తెలంగాణ సంపద 2 లక్షల కోట్లు సంపద దోపిడీకి, అన్యాయానికి గురైంది. కేసీఆర్ 10.5, 11 %కు కార్పొరేషన్ లోన్లు తీసుకు వచ్చారు. బీఆర్ ఎస్ తీసుకు వచ్చిన అప్పులకు రిపేమాంట్ ఇంట్రెస్ట్ 18 వేల కోట్లు అవుతుంది.' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.

# కన్ స్ట్రక్షన్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తాం

**మొదటిపేజీ తరువాయి**

ఆర్ అండ్ బీ ఎంప్లాయీస్‌అసోసియేషన్, న్యాక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీ క్యాలెండర్లను మంత్రి కోమటిరెడ్డి ఆవిష్కరించారు. బిల్డర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరించిన మంత్రి న్యాక్ సముదాయంలోని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫీస్‌లో జరిగిన అభినందన సభలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడిన బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి.. పదేండ్లు పోరాడినా..కానీ తీరని కాంట్రాక్టర్ల సమస్యను కేవలం 48 గంటల్లో జీవో ఆర్టీ నెంబర్ 25 ద్వారా వచ్చేలా చేసి బిల్డర్ల సమస్యలను పరిష్కరించిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

# రీ అపాయింట్‌మెంట్ ఆఫీసర్లు అవుట్!

**మొదటిపేజీ తరువాయి**

ఎక్కువ మంది విధులు నిర్వర్తిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాతి స్థానంలో పంచాయతీరాజ్ శాఖలో 48 మంది ఉద్యోగ విరమణ పొందిన అధికారులు విధుల్లో ఉన్నారు. రాష్ట్రానికి గుండెకాయలా భావించే సెక్రటేరియట్‌లో ఐదుగురు రిటైర్డ్ ఆఫీసర్లు విధులు నిర్వర్తిస్తుండడం విశేషం. ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తించిన రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్‌అర్విందర్ సింగ్ రిటైర్డ్ అయినా అదే స్థానంలో కొనసాగుతున్నారు. ఆయనతో పాటు వెటర్నరీ డిపార్ట్‌మెంట్‌లో అదర్ సిన్హా, ఎండోమెంట్‌లో అనిల్ కుమార్, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ లో ఉమర్ జలీల్, లేబర్‌శాఖలో రాణి కౌముదిని విధుల్లో ఉండడం గమనార్హం. మాజీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం కీలకంగా భావించిన ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ ఆఫీసర్ల అధీనంలోనే ఉంది. ఈఎన్సీలుగా రిటైర్డ్ ఆఫీసర్లు మురళీధర్ రావు, వెంకటేశ్వర్లు కొనసాగుతున్నారు. వీళ్లతో పాటు ఎస్ఈలు, ఈఈలు కూడా రిటైర్డ్ ఆఫీసర్లే ఉండడం గమనార్హం.

**విధేయతకు పట్టం..**

గత ప్రభుత్వం తమకు అనుకూలంగా పనిచేసిన ఆఫీసర్లు రిటైర్డ్అయినప్పటికీ స్పెషల్‌గా జీవోలు ఇచ్చి వారిని అదే స్థానంలో కొనసాగించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా కీలక శాఖల్లో ఉన్నఅధిపతులకు ఈ అవకాశం కల్పించిందనే ఆరోపణలున్నాయి. రిటైర్డ్ ఆఫీసర్లే కీరోల్ గా వ్యవహరించారని తెలుస్తోంది.

**రెండు రోజుల్లో సీఎంకు లిస్ట్**

రిటైర్డ్ ఆఫీసర్లను ఇంటికి పంపేందుకు రేవంత్ రెడ్డి గవర్నమెంట్‌సిద్ధమైన విషయం తెలిసిందే. ఇందుకోసం లెక్కలు తీసిన రేవంత్ సర్కారు చర్యలకు సిద్ధమవుతోంది. దావోస్ పర్యటనలో ఉన్న సీఎం తిరిగి హైదరాబాద్ చేరుకోగానే లిస్ట్‌ను ఆయనకు అందించేందుకు సీఎస్ సిద్ధంగా ఉన్నారు.

# తెలంగాణ'ను చంపే కుట్ర




**మొదటిపేజీ తరువాయి**

హోదాలో రేవంత్ మాట్లాడారు. తుమ్మల నాగేశ్వర్ రావు రుణాలు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే కేసులు పెట్టండి అని అంటున్నాడు. పత్రికల్లో కూడా వచ్చింది. ప్రియాంక గాంధీ నిరుద్యోగ భృతి ఇస్తామని చెబితే, భట్టి విక్రమార్క భృతి ఇస్తామని చెప్పలేదని హరీష్ రావు అడిగిన ప్రశ్నకు అసెంబ్లీ సాక్షిగా అబద్ధం చెప్పారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తామని హామీ ఇచ్చారు కానీ అది సాధ్యం కాదని మొన్న స్పష్టమైంది' అని కేటీఆర్ పేర్కొన్నారు.

'కాంగ్రెస్ నోటికి ఎంత వస్తే అంత అనుకుంటూ హామీలు ఇచ్చారు. అందుకే 420 హామీలను అమలు చేసేదాకా విడిచి పెట్టం. ప్రధాని, అదానీ ఒక్కటని విమర్శలు చేసిన రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి నేడు ఆయనతోనే ఒప్పందాలు కుదుర్చుకున్నారు. రాహుల్ గాంధీ నిన్ననే అదానీని తిడితే, రేవంత్ రెడ్డి అదే సమయంలో దావోస్‌లో ఒప్పందం చేసుకున్నారు. నోటికి వచ్చినట్లు మాట్లాడిన కాంగ్రెస్, బీజేపీ నాయకుల అసలు రంగు బయట పడుతున్నది. కేసీఆర్ ఉన్నంత కాలం అదానీ ఇక్కడ అడుగు పెట్టలేదు. కానీ కాంగ్రెస్ రాగానే ఎలా అడుగు పెడుతున్నాడని కేటీఆర్ నిలదీశారు.

ఇక హరీశ్ రావు నాయకత్వంలో కార్యకర్తలంతా క్రియాశీలకంగా పని చేయడంతో గత ఎంపీ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించాం. ఈ సారి కూడా మెదక్‌లో గులాబీ జెండా ఎగరబోతున్నది. ఇందులో ఎలాంటి సందేహం లేదు. గత పదేళ్ళలో తెలంగాణ తరుపున గళం విప్పింది మన బీఆర్ఎస్ ఎంపీలు అనే విషయం మరచి పోవద్దు. రాష్ట్ర ప్రయోజనాలు కాపాడేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమే. మన బలం, మన గళం, మన గులాబీ జెండా పార్లమెంట్ లో ఉండాలి. లేకుంటే తెలంగాణ ప్రయోజనాలకు నష్టం జరుగుతుందని. ఇదే విషయం ప్రజలకు చెప్పాలి. నిరాశ వీడాలి. బయటికి రావాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

# దావోస్ టూర్ గ్రాండ్ సక్సెస్

**మొదటిపేజీ తరువాయి**

లిమిటెడ్ కంపెనీ తెలంగాణలో రూ.8,000కోట్ల పెట్టుబడితో ఆర్ అండ్ డీతోపాటు గిగా సేల్ బ్యాటరీ సెల్ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఇక రాష్ట్రంలోని 50 ఐటీఐలలో మోడ్రన్‌టెక్నాలజీ నైపుణ్య శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు టాటా గ్రూపు ముందుకొచ్చింది. వీటిలో కొత్త కోర్సులు, మాస్టర్ ట్రైనర్ల నియామకానికి రూ.1500 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. మరికొన్ని సంస్థలు కూడా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివిధ ఫోరమ్‌లలో మాట్లాడారు. చిన్న, సన్నకారు రైతుల పక్షాన నిలబడాలని ప్రపంచ దిగ్గజ కంపెనీలకు పిలుపునిచ్చారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే ప్రక్రియకు సహకరించాలని కోరారు.

మరో సదస్సులో మాట్లాడుతూ హైదరాబాద్‌ను ఆసియా మెడికల్ టూరిజం రాజధానిగా మార్చడానికి హెల్త్ కేర్ ను సాఫ్ట్ వేర్ తో సమ్మిళితం చేయాలన్నారు. ఖరీదైన హెల్త్ కేర్ సేవల ఖర్చులను తగ్గించేందుకు అమెరికా, యూరప్ దేశాలు పని చేస్తున్నాయని అన్నారు. హెల్త్ కేర్ సేవలను అందరికీ అందుబాటులో ఉంచేందుకు, అధునాతన వైద్య సేవలను ప్రతి మారుమూల ప్రాంతాల ప్రజలకు చేరుకోడానికి డిజిటల్, సాంకేతికను ఉపయోగించాలని సీఎం అన్నారు. ముఖ్యమంత్రితో సమావేశమైన భారతీయ పారిశ్రామికవేత్తలు, గ్లోబల్ బిజినెస్ లీడర్లందరూ తెలంగాణలో కొత్త ప్రభుత్వం అనుసరించిన వ్యాపారం, స్నేహ దృక్పథానికి సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు.



**బిజినెస్‌మెన్‌లను కలవడం సంతోషం..**

దావోస్‌కు రావడం.. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన వ్యాపారవేత్తలను కలుసుకోవడం సంతోషంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. 'అభివృద్ధితో పాటు సంక్షేమం అందించాలంటే పెట్టుబడులు, వృద్ధి కలిసి రావాలి. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించేందుకు నిరంతరం మా ప్రయత్నం కొనసాగుతుంది. పారిశ్రామికవేత్తలందరూ హైదరాబాద్ కు రావాలి' అని స్వాగతం పలికారు.

**లండన్ చేరుకున్న సీఎం టీమ్..**

ఇక మూడు రోజుల దావోస్ పర్యటన ముగించుకుని సీఎం రేవంత్‌రెడ్డి లండన్ చేరుకున్నారు. లండన్‌లోని ప్రఖ్యాత థేమ్స్ నది అపెక్స్ గవర్నింగ్ బాడీ ఆఫీసర్లతో దాదాపు మూడు గంటల పాటు సమావేశమయ్యారు. థేమ్స్ నది నిర్వహిస్తున్న తీరును, అక్కడి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు అభివృద్ధి చేసిన తీరును ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. మూసీ నది ప్రక్షాళన ఒప్పందంపై చర్చించారు. థేమ్స్ నది నిర్వహణపై స్టడీ చేసి మూసీ నది ప్రక్షాళనలో అమలు చేయాలనే ఆలోచనలో సీఎం ఉన్నారు. మూసీ నది ప్రక్షాళనపై పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డికి ఆఫీసర్లు తెలిపారు. మరోవైపు లండన్ అర్బన్ లేఅవుట్ అభివృద్ధిపై ఏరియల్ స్టడీ కోసం లండన్ షార్ట్ వ్యూను ఎంఐఎం నేత అక్బరుద్దీన్‌తో కలిసి సీఎం సందర్శించారు. దశాబ్దాలుగా వివిధ దశల్లో థేమ్స్ నదీ తీరం వెంట చేపట్టిన సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను అక్కడి కార్పొరేట్ అఫైర్స్ డైరెక్టర్ సియాన్ ఫోస్టర్, ఫోర్డ్ ఆఫ్ లండన్ అథారిటీ హెడ్ రాజ్ కెహల్ లివీ సీఎంకు వివరించారు. అందులో భాగంగా ఎదురైన సవాళ్లు, పరిష్కారాలు, ఖర్చయిన నిధులు, భాగస్వామ్యమైన సంస్థలు, అందంగా తీర్చిదిద్దేందుకు అనుసరించిన అత్యుత్తమ విధానాలన్నీ ఈ సందర్భంగా చర్చించారు. 'నదులు, సరస్సులు, సముద్ర తీరం వెంట ఉన్న నగరాలన్నీ చారిత్రాత్మకంగా అభివృద్ధి చెందాయి. హైదరాబాద్ సిటీకి అటువంటి ప్రత్యేకత ఉంది. అటు మూసీ నది వెంబడి, ఇటు హుస్సేన్ సాగర్ చుట్టూ, ఉస్మాన్ సాగర్ లాంటి నదీ వ్యవస్థ కేంద్రంగా హైదరాబాద్ అభివృద్ధి చెందింది. పునరుజ్జీవ ప్రాజెక్టు ద్వారా తిరిగి మూసీకి పునర్వైభవం తీసుకు వస్తే నదులు, సరస్సులతో హైదరాబాద్ మరింత శక్తివంతంగా తయారవుతుంది...' అని ముఖ్యమంత్రి వివరించారు.

తన విజన్ 2050 కు అనుగుణంగా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి లండన్ అధికారులు సానుకూలతతో చర్చలు జరిపారు. నదీ ఒడ్డున అభివృద్ధి కార్యక్రమాలతో పాటు నదీ సంరక్షణకు అత్యున్నత ప్రాధాన్యమిచ్చినట్లు అక్కడి అధికారులు వివరించారు. నదీ జలాలను సుస్థిరంగా ఉంచటం, ఎంచుకున్న ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఎక్కువ ప్రయోజనముండే రెవిన్యూ మోడల్ ను ఎంచుకోవాలని చెప్పారు. ఈ ప్రాజెక్టును మరింత అత్యుత్తమంగా తీర్చిదిద్దే కొత్త విధానాలు ఎప్పటికప్పుడు గమనించటంతో పాటు, ప్రాజెక్టు నిర్వహణపై నిరంతరం దృష్టి పెట్టాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శేషాద్రి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్, సీఎం స్పెషల్ సెక్రెటరీ బి.అజిత్ రెడ్డి, హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రాపాలీ, ఇన్వెస్ట్‌మెంట్స్ అండ్ ప్రమోషన్స్ స్పెషల్ సెక్రెటరీ విష్ణువర్ధన్ రెడ్డి, మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ ఎస్ఈ వెంకట రమణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# పెత్తందారులకు దళితులంటే చులకన

**మొదటిపేజీ తరువాయి**

ట్యాబ్‌లు ఇస్తుంటే కుట్రపూరిత వార్తలు రాయడం అంటరానితనమే. దళితులకు చంద్రబాబు సెంటు భూమి కూడా ఇచ్చింది లేదు. బీసీ, ఎస్సీ, ఎస్టీలపై చంద్రబాబుకు ఏ కోశానా ప్రేమలేదు. ప్రభుత్వం బడుల రూపురేఖలు మారిస్తే పెత్తందారులకు నచ్చడం లేదు. అంబేద్కర్ భావజాలం పెత్తందారులకు నచ్చదని సీఎం జగన్ దుయ్యబట్టారు. పెత్తందారులకు దళితులంటే చులకన. పెత్తందారీ పార్టీలకు, పెత్తందారి నేతలకు పేదలు అవసరం లేదు. రియల్ ఎస్టేట్ రాజధాని కోసం పేదల భూములు లాక్కున్నారు. రాష్ట్రాన్ని దోచుకోవడమే పెత్తందారుల లక్ష్యం. గతంలో చంద్రబాబు ఎందుకు బటన్ నొక్కలేకపోయారు. చంద్రబాబు ఎందుకు సామాజిక న్యాయం అమలు చేయలేకపోయారని సీఎం జగన్ ధ్వజమెత్తారు.

**ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహం**

విజయవాడ స్వరాజ్య మైదాన్ లో ఏర్పాటు చేసిన 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహాన్ని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయ మహాశిల్పం పేరిట అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. అందరినీ ఒక్కతాటిపై తీసుకురావడానికి అంబేద్కరే స్ఫూర్తి అని పేర్కొన్నారు. విజయవాడలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం ప్రపంచంలోని ఇతర అంబేద్కర్ విగ్రహాలన్నింటి కంటే పెద్దది అని వెల్లడించారు. స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ కు ఇకపై విజయవాడ చిరునామాగా మారుతుందని పేర్కొన్నారు. ఈ మహా విగ్రహం అందరికీ స్ఫూర్తిదాయకం అని, కానీ పెత్తందారుల పత్రికలు చరిత్రను కూడా వక్రీకరిస్తున్నాయని సీఎం జగన్ విమర్శించారు. అంబేద్కర్ భావజాలం పెత్తందార్లకు నచ్చదని అన్నారు. దళిత, బలహీన వర్గాలపై చంద్రబాబుకు ప్రేమ లేదని విమర్శించారు.

పూర్తిగా మేడిన్ ఇండియా : విజయవాడలో నెలకొల్పిన అంబేద్కర్ విగ్రహాన్ని పూర్తిగా స్వదేశీ వస్తువులతోనే రూపొందించారు. ఇందుకోసం రూ.404.35 కోట్లు ఖర్చు చేశారు. 18.18 ఎకరాల్లో ఈ భారీ ప్రాజెక్టు నిర్మించారు. దీంట్లో అంబేద్కర్ పీఠం 81 అడుగులు కాగా, ప్రధాన విగ్రహం 125 అడుగుల ఎత్తు ఉంటుంది. పీఠంపై జీ ప్లస్ 2 తరహాలో గదులు నిర్మించారు. పీఠాన్ని బౌద్ధ మత కాలచక్ర మహామండపం తరహాలో తీర్చిదిద్దారు. ఇక్కడ అంబేద్కర్ జీవిత విశేషాలతో కూడిన ప్రత్యేక కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. అంతేకాదు, రెండు వేల మంది సామర్థ్యంతో కూడిన కన్వెన్షన్ సెంటర్ కూడా ఉంది.

# 22 సెలవు ప్రకటించండి

- ఆ రోజు కోసం యావత్ ప్రపంచమే ఎదురుచూస్తోంది
- అక్షింతలను రేషన్ బియ్యం అని ఎద్దేవా చేస్తారా?
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

**విశాలభారతి,హైదరాబాద్:**



అయోధ్య రామాలయంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కోట్ల మంది భారతీయులు ఎదురుచూస్తున్న శుభఘడియలు సమీపిస్తున్నాయి. 22న బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా... తెలంగాణ ప్రభుత్వం సెలవు ప్రకటించాలని బీజేపీ ఎంపీ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్ కోరారు. ఈ నెల 22న అయోధ్యలో జరగబోయే రామ మందిర పునఃప్రతిష్ట కోసం...యావత్ ప్రపంచమంతా ఎదురు చూస్తోందన్నారు. ఆ రోజు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి, పవిత్రమైన దైవ కార్యంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా చూడాలని కోరారు.

**సీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేసిన సంజయ్**

హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఇల్లందకుంటలో ప్రసిద్ధి చెందిన సీతారామచంద్ర స్వామి దేవాలయాన్ని బండి సంజయ్ కుమార్ దర్శించుకున్నారు. ఆలయ పండితులు బండికి ఆశీస్సులు అందజేశారు. చీపురు, పార బట్టి సీతారామచంద్రస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఆయనతో పాటు బీజేపీ జిల్లా అధ్యక్షులు క్రిష్ణారెడ్డి, పార్టీ కార్యకర్తలంతా ఆలయ పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించారు. ప్రధాన మంత్రి మోడీ, జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా పిలుపు మేరకు దేవాలయాల శుద్ధి చేస్తున్నామని బండి సంజయ్ వెల్లడించారు. ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి దేవాలయ పరిసరాలను శుద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు.

**నిధి సేకరణలో తెలంగాణదే అగ్రస్థానం**

అయోధ్యలో అందాల రాముడు, అయోధ్య రాముడు, ఆదర్శ రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట కోసం యావత్ ప్రపంచమంతా ఎదురు చూస్తోందన్నారు బండి సంజయ్. తెలంగాణ ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు 22న సెలవు దినంగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు దేవుడి అక్షింతల కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని తెలిపారు. రామ మందిర నిర్మాణ నిధి సేకరణలో తెలంగాణ రాష్ట్ర అగ్రస్థానంలో ఉందన్నారు.

**కాంగ్రెస్ నేతలకు బండి సంజయ్ కౌంటర్**

అయోధ్య అక్షింతలను రేషన్ బియ్యం అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలను ఖండించారు. అక్షింతల్లో రేషన్ బియ్యం, బాసుమతి బియ్యం, జై శ్రీరాం బియ్యం అనే రకాలు ఉండవన్నారు బండి సంజయ్. పవిత్రమైన దేవుడి అక్షింతలను రేషన్ బియ్యం అంటూ కాంగ్రెస్ నేతలు వక్రీకరించడం మంచి పద్ధతికాదన్నారు. కాంగ్రెస్ నేతలు కోరితే బాసుమతి బియ్యాన్ని పంపించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

# బంగారు పళ్లెంలో కాదు.. తెలంగాణను అప్పుల కుప్ప చేసిన్రు

- నాడు రెండేండ్లు అయినా.. పసిగుడ్డు అన్నోళ్లు..
- నేడు రెండు నెలలు కూడా ఆగుతలేరేం..
- మంత్రి జూపల్లి కృష్ణారావు ఫైర్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



తెలంగాణకు పెట్టుబడులు తీసుకురావడంలో భాగంగానే పారిశ్రామికవేత్త అదానీని సీఎం రేవంత్ రెడ్డి కలిశారని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. శుక్రవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ' బీఆర్ఎస్‌ప్రభుత్వం ఎన్నో చీకటి జీవోలు ఇచ్చింది. రాష్ట్రం బంగారుపళ్లెం కాదు.. అప్పుల కుప్పగా మార్చారు. రూ.7 లక్షల కోట్ల అప్పు చేశారు. రూ.40 వేల కోట్లు వడ్డీలకే పోతోంది. బీజేపీ తెచ్చిన ప్రతి బిల్లుకు పార్లమెంటులో బీఆర్ఎస్ మద్దతు ఇచ్చింది. ఇరుపార్టీల స్నేహాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు. అందువల్లే రూ.వేల కోట్లు కుమ్మరించినా.. శాసనసభ ఎన్నికల్లో గులాబీ పార్టీ గెలవలేదు.

2018 ఎన్నికలప్పుడు బీఆర్ఎస్‌చాలా హామీలు ఇచ్చి అమలు చేయలేదు. గతంలో విపక్షాలు టీఆర్ఎస్‌ను రెండేళ్ల తర్వాత విమర్శిస్తే.. పసికందును విమర్శిస్తున్నారా?అని వాపోయారు. మరి బీఆర్ఎస్‌నేతలు 2 నెలలు కూడా ఎందుకు ఆగలేకపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండింటిని అమలు చేసింది. మిగతా గ్యారంటీల అమలు కోసమే 'ప్రజాపాలన' నిర్వహించాం. దరఖాస్తుల పరిశీలన పూర్తి కాగానే మిగతావి అమలు చేస్తాం.

లోక్‌సభ ఎన్నికల్లో భారాస తరపున పోటీ చేసేందుకు అభ్యర్థులు భయపడుతున్నారు. బీఆర్ఎస్‌వీడటానికి ఇప్పటికే చాలా మంది సిద్ధంగా ఉన్నారు. స్థానిక సంస్థల్లో ఆ పార్టీ ప్రతినిధులే అవిశ్వాసాలు పెడుతున్నారు. గత రెండేళ్లలో కృష్ణా బేసిన్‌లో నిండుగా నీరు ఉన్నప్పటికీ సాగుకు ఇవ్వలేదు. ఈ ఏడాది వర్షాలు లేక నాగార్జునసాగర్‌లో జలాలు అడుగంటిపోయాయి. కృష్ణా బేసిన్‌లో నీరు లేనప్పుడు రెండో పంటకు ఇవ్వడం ఎలా సాధ్యం?'' అని జూపల్లి అన్నారు.

# అద్దె బస్సుల యజమానుల సమస్యలపై చర్చిస్తాం

- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**



మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా కొనసాగుతుందని రవాణా & బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సంతోషం వ్యక్తం చేశారు.. ఆర్టీసీ అద్దె బస్సు యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పై మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో అద్దె బస్సుల యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు.. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అద్దె బస్సుల యజమానులు స్వాగతించారు.. కాని తమ బస్సుల పై పడుతున్న భారాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణికులు అధికంగా ప్రయాణించడం వల్ల కేఎంపిఎల్ పై ప్రభావం పడుతుందని తెలిపారు.. ఆర్టీసీ సంస్థకు చెందిన ప్రయాణికుల తో వెళితే 60 రూపాయలు ఖర్చు అయితే తమ బస్సు 35 రూపాయలు మాత్రమే అవుతుందని తెలిపారు. గతంలో ఉన్నదానికి ప్రస్తుతానికి 2:75 నుండి 3:00 వ్యత్యాసం అవుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.. ప్రస్తుతం కిలోమీటర్ కి ఇస్తున్న 35 రూపాయలకు అదనంగా 2 రూపాయలు పెంచాలని కోరారు. అద్దె బస్సుల యజమానుల సంఘం నేతలతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా కొనసాగుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. .. మహిళలకు అందిస్తున్న ఉచిత ప్రయాణంపై అద్దె బస్సుల యజమానుల సహకారం ఉండాలని విజ్ఞప్తి చేశారు.. అద్దె బస్సుల యజమానులతో చేసిన 10 సంవత్సరాల అగ్రిమెంట్ ప్రకారమే ముందుకు వెళ్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తేల్చి చెప్పారు. కొత్త అగ్రిమెంట్ వస్తే కొత్త ప్రతిపాదనలు ఉంటాయని వెల్లడించారు.. కేఎంపీఎల్ పై ఆర్టీసీ కమిటీలో చర్చిస్తామని ఇన్సూరెన్స్ ఒపీనియన్ కూడా తీసుకుంటామని తెలిపారు.. అద్దె బస్సుల యజమానులు తమ సమస్యల పై ఎప్పుడైనా కలవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.. ప్రభుత్వంలో మీరు భాగస్వాములని బాధ్యతగా ఉండాలని తెలిపారు.. అద్దె బస్సుల యజమానుల సమస్యల పై 45 రోజుల్లో అధికారులతో కలిసి మరోసారి సమావేశానికి పిలుస్తామని తెలిపారు.





# ఒత్తిడిని జయించేందుకు ఆటలు ఎంతో మేలు

- డీపీఎస్ అసోసియేషన్ జాయింట్ డైరెక్టర్ డోలి చాన
- ఘనంగా నేషనల్ 'ఆర్చరీ ఛాంపియన్ షిప్' ప్రారంభం

**విశాల భారతి, సిటీ బ్యూరో:**

స్టూడెంట్లు మానసిక ఒత్తిడిని జయించేందుకు ఆటలు ఎంతో మేలు చేస్తాయని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అసోసియేషన్ జాయింట్ డైరెక్టర్ డోలి చాన అన్నారు. శుక్రవారం పఠాన్‌చెరు పరిధి లోని కొల్లూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీఎస్) లో 2023-24 నేషనల్‌ఆర్చరీ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి డోలి చాన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముందుగా ఆర్చరీ ఛాంపియన్‌షిప్ ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ .. స్ట్రెస్‌ను ఓవర్‌కమ్‌చేయడంతో పాటు క్రియేటివిటీ ఆలోచనా విధానం డెవలప్‌అయ్యేందుకు గేమ్స్‌ఉపయోగపడుతాయన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అసోసియేషన్ చరిత్ర లో కొల్లూరు బ్రాంచ్ లో మాత్రమే ఇలాంటి నేషనల్‌లెవల్‌గేమ్స్ నిర్వహించడం జరుగుతోందని ఆమె తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్‌నిర్వహించేందుకు చొరవ తీసుకున్న డీపీఎస్‌కొల్లూరు మేనేజ్‌మెంట్‌ను డోలి చాన అభినందించారు. డీపీఎస్‌కొల్లూరు చైర్మన్ తూమ్ భీం సేన్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థి లో వినూత్నమైన కొత్త ఆలోచన విధానం పెరిగేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్ర, తెలంగాణ తో పాటు, జమ్ము, బెంగుళూరు, హరిద్వార్, నవి ముంబయి, అమృత్‌సర్, గయ, వింధ్య నగర్ లోని డీ పీ ఎస్ స్కూల్ స్టూడెంట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎస్ సెక్రటరీ ,ప్రణయ కుమార్, తూము పవన్ కళ్యాణ్, ప్రిన్సిపాల్ సీజే వసంత తదితరులు పాల్గొన్నారు.







# బెల్టు షాపుల నిషేధంతో.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం

- ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిర్ణయం హర్షణీయం
- కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు పగిళ్ల శేఖర్

**విశాల భారతి, సంస్థాన్ నారాయణపురం :** మునుగోడు నియోజకవర్గంలో బెల్టుషాపులు నిషేధించడంపై హర్షం వ్యక్తం అవుతోంది. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపుతో యువకులు, మహిళలు నియోజకవర్గంలోని ఆయా మండల కేంద్రాలు, గ్రామాల్లో ఎక్కడికక్కడ బెల్టుషాపులను బంద్‌చేయిస్తున్నారు. శుక్రవారం సంస్థాన్‌నారాయణపూర్ మండలం.. లచ్చమ్మగూడెం గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు బెల్టుషాపులను బంద్‌చేయించారు. కాంగ్రెస్‌పార్టీ మండల యువ నాయకుడు పగిళ్ల శేఖర్ ఆధ్వర్యంలో యువకులు, మహిళలు బెల్టుషాపులో ఉన్న లిక్కర్ , బీరు బాటిల్స్‌ను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా పగిళ్ల శేఖర్ మాట్లాడుతూ.. పల్లెల్లో బెల్ట్‌షాపులను నిషేధించడం వల్ల ప్రశాంతమైన వాతావరణం నెలకొందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో బెల్ట్‌షాపులను విచ్చలవిడిగా నిర్వహించ డం వల్ల పలువురు తాగుడుకు బానిసై అనారోగ్యం బారిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. బెల్ట్‌షాపులు నిషేధించడం వల్ల యువకులు సొంత పనులపై ఫోకస్‌పెడుతూ భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు అలుగువెల్లి సుధాకర్‌రెడ్డి, పాశం శంకర్‌రెడ్డి, కాసర్ల యాదగిరి రెడ్డి, దండు పుల్లారెడ్డి , చిలువేరు శివాజీ, గండికోట నగేశ్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.



# డ్రైనేజీ పనులను పరిశీలించిన కాంగ్రెస్ నేత గుర్రాల వెంకటేష్ యాదవ్

**మేడిపల్లి,విశాలభారతి:**డివిజన్ ప్రజలకు అన్ని రకాలుగా మౌలిక వసతులు కల్పించడానికి కృషి చేస్తున్నామని, డివిజన్ అభివృద్ధిలో సహకారం అందిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గుర్రాల వెంకటేష్ యాదవ్ అన్నారు. ఈ మేరకు 24వ డివిజన్ లో జరుగుతున్న డ్రైనేజ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. జ్యోతి నగర్ నుంచి సాయి దుర్గా నగర్ వరకు జరుగుతున్న డ్రైనేజ్ భూగర్భ డ్రైనేజీ పనులను పరిశీలించి నాణ్యతతో కూడిన పనులను చేపట్టాలని రాజీ పడకూడదని కాంట్రాక్టర్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 డివిజన్ ను నాలుగు సంవత్సరాలుగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, తాము చేసినా పనులతో డివిజన్ ప్రజలు ఎంతో సంతృప్తికరంగా ఉన్నారని, ప్రజల సమస్యలు పరిష్కరించి వారితో మమేకం అవ్వడమే తనకు ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముద్దం రామ చందర్, జ్యోతి నగర్ కాలనీ అధ్యక్షులు శివ గౌడ్, సాయి దుర్గా కాలనీ అధ్యక్షులు రమణ, అమూల్య దివ్య నగర్ అధ్యక్షులు జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# అంగన్వాడీ కార్మికులపై ఏపీ ప్రభుత్వం విధించిన ఎస్మాను ఎత్తివేయాలి

**ఐఫ్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. జనార్ధన్**

**ఆంధ్రప్రదేశ్ విశాలభారతి:** ఆంధ్రప్రదేశ్ లో అంగన్వాడీ కార్యకర్తలు తమ డిమాండ్స్ సాధనకై సమ్మె చేస్తున్నా కార్మికులపై జగన్ ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడం అప్రజాస్వామికమని ఐఫ్ టియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. శుక్రవారం రాంనగర్ చౌరస్తాలో ఐఫ్ టియు గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అంగన్ వాడీ కార్మికుల సమ్మెకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించి మద్దతు ప్రకటించారు. అనంతరం ఆర్. జనార్ధన్ మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ కు 11.500, హెల్పర్స్ కు 7000 రూపాయలతో జీవనాన్ని కొనసాగించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు . గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు అరుణ,కార్యదర్శి డి. మల్లయ్య మాట్లాడుతూ ఆంధ్రాలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్ ,ప్రజాస్వామ్య పద్ధతిలో కొనసాగుతున్న సమ్మెపై ఎస్మాను ప్రయోగించడాన్ని ఖండిస్తున్నమన్నారు. గతంలో అనేక సార్లు జగన్ ప్రభుత్వానికి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని,వేతనాలు పెంచాలని ,ఈ ఎస్ ఐ,పీ ఎఫ్ తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని,పనిభారాన్ని తగ్గించాలని పలు దఫాలుగా ప్రభుత్వానికి మొర పెట్టుకున్నట్లు తెలిపారు. అయినా ప్రభుత్వం పట్టించుకోలేని విధిలేని పరిస్తితులలో ఐ ఎఫ్ టి యు,ఏఐటీయుసీ, సీఐటీయు జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మూడు సంఘాల అంగన్వాడీ యూనియన్స్ గత డిసెంబర్ 12 నుండి రాష్ట్ర వ్యాపితంగా సమ్మె కు పిలుపునిచ్చారని తెలిపారు. సమ్మె పట్ల జగన్ ప్రభుత్వం చాలా కఠినంగా వ్యవహరిస్తుందని, అంగన్వాడి యూనియన్ నాయకులతో నామమాత్రం చర్చలు జరపడం తప్ప,అందులో ఎలాంటి ఆశాజనకమైన,కార్మిక ప్రయోజనకరమైన చర్చలు కాదని విమర్శించారు. అంగన్వాడీ వర్కర్స్ సమ్మెపట్ల మొదటి నుండి చట్ట విరుద్ధంగానే వ్యవహరిస్తుందని,అందులో భాగంగానే జనవరి 6 నాడు అప్రజాస్వామికంగా ఎస్మా ను ప్రయోగించిందని, దీంతో కార్మికులు మరింత పట్టుదలతో సమ్మెను 40 రోజులుగా దీక్షతో ముందుకు సాగుతున్నారని, అంగన్వాడి కార్యకర్తలు సాగిస్తున్న న్యాయమైన సమ్మెకు ఐ ఎఫ్ టి యు సంపూర్ణ మద్దతు,సంఘీభావాన్ని ప్రకటిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో,గ్రేటర్ హైదరాబాద్ ఐ ఎఫ్ టి యు గ్రేటర్ హైదరాబాద్ ఐ ఎఫ్ టి యు నాయకులు కొర్ర మంగ్లా,మనక్క,సరోజ, లీల, వనజ, రాజమణి, కుమార్, సత్యనారాయణ, పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎం మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్,కే.శ్రీను, రంజాన్,సెమియా, మాల,ఫైమ తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల అగ్రికల్చర్ డిగ్రీ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 24న కౌన్సిలింగ్

- ఎంసెట్ - 2023అర్హత తప్పనిసరి
- ఇదే ఫైనల్ ఫేజ్‌కౌన్సిలింగ్
- ఎంజేపీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు



**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:** మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల విద్యాసంస్థల సొసైటీ లోని వనపర్తి, కరీంనగర్ అగ్రికల్చర్ మహిళా కాలేజీల్లో బీఎస్సీ(ఆనర్స్)అగ్రికల్చర్ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 24న రాజేంద్ర నగర్ లో ని అగ్రికల్చర్ యూనివర్సిటీ లో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని సోసైటీ కార్యదర్శి డాక్టర్ మల్లయ్య బట్టు తెలిపారు. ఎంసెట్ 2023లో ఉత్తీర్ణత సాధించిన వారు కౌన్సిలింగ్ కు హాజరుకావాలని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో డాక్టర్ మల్లయ్య బట్టు తెలిపారు. ఎంసెట్ లో వచ్చిన ర్యాంక్ తో పాటు గురుకుల అగ్రికల్చర్ డిగ్రీ కాలేజ్ సీట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారే ఈ కౌన్సిలింగ్ కు హాజరుకావాలని ఆయన సూచించారు. కౌన్సిలింగ్ వివరాలు, ఖాళీ సీట్ల సంఖ్య కేటగిరీల వారీగా వెబ్ సైట్ (https://mjptbcwreis.telangana.gov.in) లో ఇచ్చామని, దరఖాస్తు చేసుకున్న అమ్మాయిలు పూర్తి వివరాల కోసం వెబ్ సైట్ ను సందర్శించాలని ఆయన తెలిపారు. వెబ్ సైట్ లో ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం అన్ని సర్టిఫికెట్లతో హాజరుకావాలని డాక్టర్ మల్లయ్య బట్టు సూచించారు.

# పెసరమెల్లి రత్న శేఖర్ కు డాక్టరేట్ ప్రధానం

**మేనత్త విజయ కుమారికి డాక్టరేట్ అంకితం**



**సికింద్రాబాద్, విశాలభారతి:** ఉస్మానియా యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కళాశాల, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఇన్ఫర్మాటిక్స్) విభాగంలో, అనురాగ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పెసరమెల్లి.రత్న శేఖర్ డాక్టరేట్ పొందారు. డాక్టర్. బి.సుజాత పర్యవేక్షణలో "ఫీచర్ సెలెక్షన్ యూజింగ్ ఎవొల్యూషనరీ అల్గోరిథమ్స్ ఇన్ బిగ్ డేటా " అనే అంశంపై పరిశోధనకు పీహెచ్డీ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా తనకు విద్యా బుద్ధులు నేర్పిన అధ్యాపకులకు, జన్మనిచ్చిన తల్లితండ్రులకు రుణపడి ఉంటానని, తనకు ఎంతో ఆదర్శంగా నిలిచిన తన మేనత్తగారైన కిశే. ఎం.విజయ కుమారి కి తన డాక్టరేట్ అంకితం చేస్తున్నానని తెలియచేశారు. ఈ సందర్భంగా ప్రొ.యం.వెంకట్ దాస్, ప్రొ.యల్.సురేష్ కుమార్, పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు మరియు కుటుంబసభ్యులు అభినందించారు.

# మరోసారి తెలంగాణకు నష్టం

- ఉమ్మడి ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్తే నష్టం మనకే
- ఏపీకి లాభం.. తెలంగాణకు నష్టం
- ఎమ్మెల్యే హరీశ్ రావు

**విశాల భారతి, హైదరాబాద్:**



తెలంగాణ ప్రాంతంలో మరోసారి నీటి విషయంలో నష్టం జరగబోతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తో కలి హరీష్ రావు మాట్లాడుతూ.. ఉమ్మడి సాగు నీటి ప్రాజెక్టులు కేంద్రం చేతిలోకి వెళ్తాయనే విషయం రాష్ట్రంలో ఆందోళన పెంచుతుందన్నారు. ఉమ్మడి ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్తే ఏపీకి లాభం, తెలంగాణకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల్లోకి ప్రాజెక్టులు కేఆర్ఎంబీ పరిధిలోకి వెళ్తాయని.. ఢిల్లీ లో జరిగిన ఉన్నత స్థాయి మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం తాకట్టు పెడుతోందని విమర్శించారు.

**జూలై 2021 లోనే ప్రతిపాదనలు.. వ్యతిరేకించిన కేసీఆర్**

ఉమ్మడి ప్రాజెక్టులను కేంద్రం కేఆర్ఎంబీ పరిధిలోకి తేవాలని కేంద్రం జూలై 2021 లోనే ప్రతిపాదించగా.. బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్ గట్టిగా వ్యతిరేకించారని హరీష్ రావు తెలిపారు. పార్టీలు ఎన్నికలప్పుడు రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత రాష్ట్ర అభివృద్ధిపై చర్చించాలని సూచించారు. ఆనాడు కేసీఆర్ పెట్టిన షరతులకు కేంద్రం ఒప్పుకోలేదని చెప్పారు. ఇప్పటి వరకూ కృష్ణా జలాల్లో ఇంకా తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన వాటా తేలనప్పుడు కేఆర్ఎంబీ పరిధిలోకి ఉమ్మడి ప్రాజెక్టులను ఎలా తెస్తారని ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీష్ రావు ప్రశ్నించారు.

'కృష్ణా నీటిని ఏపీకి 50 శాతం తెలంగాణ కు 50 శాతం పంపిణీ చేయాలని కూడా షరతు పెట్టాం. శ్రీశైలం నుంచి జల విద్యుత్ ఉత్పత్తి చేసి 264 టీఎంసీ ల నీటిని నాగార్జున సాగర్ కు విడుదల చేయాలని మరో షరతు పెట్టాం. కేఆర్ఎంబీపై ఏకపక్ష నిర్ణయం తీసుకోకుండా అపెక్స్ కమిటీ వేయాలని మేము ఆనాడే కోరాం. ఒక సంవత్సరం లో వాడుకోని నీటిని మరో సంవత్సరం వాడుకునేలా వెసలు బాటు కనిపించాలని కేంద్రాన్ని ఇదివరకే కోరాం. ఆపరేషన్ మాన్యువల్ రూపొందించకుం ... లో

మిగతా 4లో

కి తెస్తారు ? పాలమూరు రంగారెడ్డి కి జాతీయ హోదా కేంద్రం ఇవ్వమంటే ఒప్పుకున్నట్టే కేఆర్ఎంబీకి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకున్నట్టు అనిపిస్తుంది. ఇది ఏపీ సీఎం జగన్ విజయం అని వార్తలు వస్తున్నాయని' హరీశ్ రావు పేర్కొన్నారు.

**జల విద్యుత్ ఉత్పత్తి పై తీవ్ర ప్రభావం**

కేఆర్ఎంబీ పరిధి లోకి ఉమ్మడి ప్రాజెక్టులను తెస్తే జల విద్యుత్ ఉత్పత్తి పై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. దాదాపు 5 వేల మిలియన్ యూనిట్ల జల విద్యుత్ ను మనం కోల్పోతామని చెప్పారు. కేఆర్ఎంబీ చేతిలో ప్రాజెక్టులు పెడితే మనకు ఇష్టం ఉన్నపుడు విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ఉండదు. కేఆర్ఎంబీకి దరఖాస్తు పెట్టి వాళ్ళు అనుమతించే లోపు గ్రిడ్ కుప్ప కూలుతుందన్నారు. థర్మల్ విద్యుత్ ఉత్పత్తి మొదలు కావడానికి తొమ్మిది గంటలు పడుతుంది. టెయిల్ పాండ్ ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పత్తి కి కూడా వీలు పడదని అభిప్రాయపడ్డారు. నాగార్జున సాగర్ ఎడమ గట్టు కాలువ ఆయకట్టు పై కూడా కేఆర్ఎంబీ ఎఫెక్ట్ ఉంటుందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే హైదరాబాద్ కు తాగునీటికి సమస్య ఏర్పడుతుందన్నారు.

# 'చెర్వుగట్టు' ప్రధానర్చకుడు రామలింగేశ్వర శర్మకు.. అయోధ్యకు ఆహ్వానం

**హర్షం వ్యక్తం చేసిన ఆలయ అర్చకులు, నిర్వాహకులు**

**విశాల భారతి, నల్గొండ:**



అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అయోధ్య రామ మందిర్ ప్రారంభోత్సావానికి సర్వం సిద్ధమైంది. జనవరి 22న అంగరంగ వైభవంగా మందిరాన్ని ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అయోధ్యలో కొలువుదీరనున్న శ్రీరాముని దర్శన భాగ్యం కోసం దేశ వ్యాప్తంగా కోట్లాది మంది రామభక్తులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే దేశంలోని పలు రంగాలకు చెందిన ప్రముఖులకు ఆలయ ట్రస్ట్ వారు ఆహ్వానాలు పంపారు. అయితే శ్రీ రామ క్షేత్ర తీర్థ్ ట్రస్ట్ నల్గొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెరువుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థాన ప్రధాన అర్చకుడు, కరసేవకుడైన డాక్టర్‌పోతులపాటి రామలింగేశ్వర శర్మకు రామ్ మందిర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించింది. ఈ నెల 22న రామ మందిర ప్రారంభం, బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొనాలని కోరింది. 1990లో సంఘ్ నాయకుడు ఆలె నరేంద్ర ఆధ్వర్యంలో బాబ్రీ మసీద్ పై కరసేవకుల పోరాటంలో జిల్లా నుంచి వెళ్లిన కర సేవకుల్లో పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఒకరు. దాదాపు 20 రోజులపాటు అయోధ్యకు వెళ్లి అక్కడ 7 రోజుల పాటు పోలీసుల నిర్బంధంలో ఉన్నారు. కానీ నాటి నా పోరాటానికి గుర్తింపు దక్కి ఇలా తనకు అయోధ్య రామమందిర ప్రారంభం, బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠలో పాల్గొనే అవకాశం లభిస్తుందని, తాను ఊహించలేదని, ఇది తనకు , తన కరసేవకు దక్కిన గౌరవంగా భావిస్తానని రామలింగేశ్వర శర్మ పేర్కొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు రామలింగేశ్వర శర్మకు అయోధ్యకు ఆహ్వానం అందడంపై ఆలయ పండితులు, పాలకమండలి, నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు.



# మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త గాలన్న మృతి

- సంతాపం తెలిపిన రాజకీయ నాయకులు

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**


కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త, మాజీ పీపుల్స్ వార్ నేత గాలన్న గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం కరీంనగర్‌లో లైఫ్ లైన్ ఆసుపత్రిలో తుది శ్వాస విడిచారు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామమైన సైదాపూర్ మండలం వెంకటేశ్వర్ల పల్లెకు బంధువులు తరలించారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బొడిగె గాలన్న కన్నుమూశారు. దీంతో పలువురు రాజకీయ ప్రముఖులు గాలన్న మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

# వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

- స్పెషల్ క్లాసులు నిర్వహించాలి
- కేజిబివిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ యస్ వెంకట్రావు

**సూర్యాపేట, విశాలభారతి:** 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట మండలంలోనిఇమాంపేట వద్ద గల కేజీబీవీ పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. కేజీబీవీలలో 10 తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. బోధిస్తున్న విధానాన్ని సబ్జెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం టెన్త్ క్లాస్ విద్యార్థులతో స్కూల్ ఆవరణలో విద్యతోపాటుగా ఇతర అంశాలలో వారికి ఉన్న ఆసక్తిని ఒక్కొక్కరిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని అన్ని కేజీబీవీ లలో వాటర్ ,టాయిలెట్స్, అన్నిచోట్ల రిపేరు చేసి పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ తెలిపారు. వీటన్నిటికీ కేజీబీవీ లలోని ఎస్ఓ లకు నిధులు మంజూరు చేస్తానని కలెక్టర్ పేర్కొన్నారు .జిల్లాలోని నాలుగు కేజీబీవీ లలో ఆటలలో, నియోజకవర్గాలలోని నాలుగు కేజీబీవీ లలో నాటక రంగాలలో నైపుణ్యత సాధించేందుకు పిఇటిలు,మాస్టర్ లను తాత్కాలిక పద్ధతిలో నియమించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. విద్యార్థిని విద్యార్థులు విద్యుతో పాటుగా అన్ని రంగాలలో నైపుణ్యత సాధించాలని కలెక్టర్ పేర్కొన్నారు. మార్చి 14 నుండి జరిగే 10వ తరగతి పరీక్షలకు గాను స్పెషల్ క్లాసులు నిర్వహించాలని, పదవ తరగతి చదువుతున్న విద్యార్థులలో సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గమనించి వారికి ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని స్కూల్ హెచ్ఎంస్ వారిని నిరంతరం గమనిస్తూ బాగా చదివించి ప్రతి రెండు రోజులకు ఒకసారి ప్రత్యేక పరీక్ష నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిఇఓ ఆశోక్, యస్ఓ అనిత,కేజీబీవీ సేక్టోరల్ అదికారి వై.రాంబాబు,టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





## బొగ్గు వల్ల రోడ్డు ప్రమాదాలు

**మఠంపల్లి విశాలభారతి :** మండల కేంద్రం రైల్వే స్టేషన్ నుంచి పెదవీడు మీదుగా నాగార్జున సిమెంట్ ఫ్యాక్టరీ వెళ్లే బొగ్గు సరఫరా ద్వారా.. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇట్టి రోడ్డు ప్రమాదంలో కుర్రి అంజయ్య, అనే వ్యక్తికి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇంకొక మహిళ కూడా ప్రమాదం జరిగింది. ఇప్పటివరకు తెలిసిన సమాచారం ప్రకారం ముడు ప్రమాదాలు అ స్థలములో జరిగాయి. అట్టి ప్రమాద స్థలములో చిన్న చిన్న బొగ్గు గులికలు లారీలనుంచి కింద పడడం వలన మరియు , దుమ్ము, ధూళి రోడ్డును కమ్మేటం వలన ఇట్టి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. బొగ్గు రవాణాసర్వీసులను జాగ్రత్తగా చేయాలని మనవి చేస్తూ.. ప్రమాదాలను జరగకుండా చూడాలని నాగార్జున సిమెంట్ యాజమాన్యానికి మనవి చేస్తున్నారు. కార్యక్రమంలో రెడపంగు నాగరాజు చిలక. లోకేష్ ఎండి.అక్బర్ , రెడపొంగు కాశయ్య ఉన్నారు.



## బిజెపితోనే దేశ అభివృద్ధి: మాజీ ఎంపీ బూర

**చిట్యాల, విశాలభారతి:** బిజెపితోనే దేశం అభివృద్ధి చెందుతుందని భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు డా.బూర నర్సయ్య గౌడ్ అన్నారు.శుక్రవారం నాడు చిట్యాల మండల బిజెపి కార్యవర్గ సమావేశం లో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ లక్ష్మి నరసింహ స్వామి ప్రమాద బీమా ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన గురించి వివరిస్తూ ఒక కుటుంబంలో ఒక వ్యక్తి ప్రమాదానికి గురై చనిపోతే 5 లక్షల బీమా నరసన్న బీమా కుటుంబానికి ధీమా అని తెలుపుతూ.. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా 18 కులవృత్తులకు ఐదు రోజులు నైపుణ్య శిక్షణ ఇస్తూ రూ 17500 విలువగల ఆర్థిక సాయం చేస్తూ ఒక లక్ష రూపాయల లోన్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి పార్లమెంటు నియజకవర్గంలో బీజేపీనీ గెలిపించి నరేంద్ర మోడీని మళ్లీ ప్రధాని చేయడంలో భాగస్వామ్యం అవుదామని, ప్రతి ఒక్క కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి పార్లమెంటు కన్వీనర్ బంధారపు లింగస్వామి, నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మైల నరసింహ,కో కన్వీనర్ మాదురి ప్రభాకర్ రావు, భువనగిరి పార్లమెంటు విస్తారక్ అఖిల్ మీర్జా, జిల్లా అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కన్నబోయిన మహాలింగం,ఎస్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాస శ్రీను,పట్టణ ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్, నియోజకవర్గ లీగల్ సెల్ కన్వీనర్ గుండాల నరేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు నర్ర మాధవి,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాపై ప్రత్యేక దృష్టి సాధించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్




**సూర్యాపేట, విశాలభారతి:** ఫోటో ఓటరు జాబితా కార్యక్రమం లో భాగంగా ఎలాంటి పొరపాట్లు లేని స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించే విధంగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఫోటో ఓటరు జాబితా కార్యక్రమం2024 లో స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా తుది జాబితా రూపొందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు, జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ ప్రియాంక ,వెంకట్ రెడ్డి ఎన్నికల విభాగం అధికారులు శ్రీనివాస రాజు, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.





## వీగిన అవిశ్వాస తీర్మానం

**మిర్యాలగూడ, విశాలభారతి:** మండలంలోని తడకమళ్ల పీఏ సీ ఎస్ చైర్మన్ సంజీవరెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లపై అవిశ్వాసం పెట్టాలని ఇటీవల సొసైటీ డైరెక్టర్లు ఆఫీసర్లకు వినతి పత్రం అందజేశారు. ఈ క్రమంలో శుక్రవారం డీసీవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాసం నిర్వహించారు. అవిశ్వాసం పై వినతిపత్రం ఇచ్చిన డైరెక్టర్లలోనే ఓ ఇద్దరు డైరెక్టర్లు ఓటు వేసేందుకు రాకపోవటంతో అవిశ్వాసం వీగిపోయింది. అవిశ్వాసం ప్రతిపాదించిన డైరెక్టర్లే బీ ఆర్ ఎస్ కు సపోర్ట్ చేసి అవిశ్వాసం వీగిపోయేలా చేయడంపై రాజకీయ వర్గాల్లో చర్చ నీయాంశమైంది. అవిశ్వాసం వీగిపోవడంతో పీఏ సీఎస్ చైర్మన్ గా సంజీవరెడ్డి , వైస్ చైర్మన్ గా వెంకటేశ్వర్లు కొనసాగనున్నట్లు డీసీవో వెల్లడించారు. అవిశ్వాసం నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రత చర్యలు చేపట్టినట్లు మిర్యాలగూడ రూరల్ పోలీసులు తెలిపారు. పరిపాలనపై దృష్టి సారించండి రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఇటీవల ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అవిశ్వాసాలను పక్కనపెట్టి ప్రజల్లో విశ్వసనీయత పెరిగేలా పాలనపై దృష్టి సారించాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. సమావేశంలో బీఆర్ ఎస్ మండల ప్రెసిడెంట్ మట్టపల్లి సైదులు యాదవ్, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, మోహన్ గౌడ్, శేఖర్ రావు ఉన్నారు.



## లంబాడీలు హక్కుల కోసం ఉద్యమించాలి

లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కో కన్వీనర్ గుగులోతు భీమా నాయక్

**మహబూబాబాద్, విశాలభారతి:** లంబాడీ హక్కుల పోరాట సమితి (ఎల్ హెచ్ పీయస్) మహబూబాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశం శుక్రవారం బానోత్ శంకర్ నాయక్, చందులాల్ నాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర కో కన్వీనర్ గుగులోతు భీమా నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా భీమా నాయక్ మాట్లాడుతూ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన పాత్ర పోషించింది కేవలం లంబాడీలు మాత్రమే అని, 40 స్థానాల్లో టిఆర్ఎస్ ఓడిపోవడానికి కారణం లంబాడీలు గిరిజనులే అని సాక్షాత్తు కేటీఆర్ తన ప్రసంగంలో చెప్పారని తెలిపారు. రాష్ట్రంలో కెసిఆర్ నియంత పాలనకు లంబాడీలు చరమ గీతం పాడారని, తద్వారా కాంగ్రెస్ పార్టీనీ అధికారంలోకి తీసుకొచ్చారని దీనిని కాంగ్రెస్ పార్టీ గుర్తించి,కాంగ్రెస్ పార్టీకోసం కష్టబడ్డ లంబాడిలకు ప్రముఖ స్థానం కేటాయించాలనీ అన్నారు. దాంతో పాటు దేశంలో పార్లమెంట్ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో బిజెపి పార్టీని సైతం ఇంటికి పంపించాలని ,దానికి లంబాడీలు సిద్దంగా వుండాలని పిలుపునిచ్చారు. దేశం లో బిజెపి అధికారంలో వచ్చినప్పటి నుండి దళితుల మీద గిరిజనుల మీద,ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల మీద దాడులు ,అత్యాచారాలు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగిపోయాయని తెలిపారు. ఈ సమావేశంలో ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు ఉదయ్ నాయక్, వీరన్న నాయక్, అంగోత్ శివాజీ నాయక్, రాందాస్ నాయక్,రవీందర్ నాయక్, సేవాలాల్ నాయక్, లింగ్యా నాయక్, బాలు నాయక్, వెంకన్న,రమేష్ తదితరలు పాల్గొన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ

**మహబూబాబాద్, విశాలభారతి:** స్థానిక గార్ల పట్టణంలోని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఈరోజు పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ కొనకంచి నర్సయ్య ఈరోజు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ 2024 పార్టీ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ క్యాలెండర్ పేద ప్రజల, అణగారిన వర్గాల వారి వెన్నుదన్నుగా నిలిచేదిలా ఉండి,ఉద్యమ పంథాలో ప్రజల ఆలోచింపచేసేదిలా ఉందని, పర పీడనకు పరాకాష్ఠ విప్లవోద్యమేనని గుర్తు చేసి, ప్రజాపోరులో ఎన్నిసార్లు మరణించైనా, మీకోసం మరల,మరలా పోరాడతామనే సందేశాత్మక క్యాలెండరని కొనియాడారు. ఈ ఆవిష్కరణ సభలో పార్టీ మండల కార్యదర్శి కామ్రేడ్ జి .సక్రుతో పాటు నాయకులు మట్టపల్లి వీరభద్రం,సూత్రపు మనోహర్, సిహెచ్ .గణేష్,బి.మంగీలాల్,యం.మాన్య,విశ్వనాథం,ఐతం శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## జర్నలిస్టుల అభ్యున్నతికి కృషి చేస్తా

ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొర్రూర్ , విశాలభారతి:** డివిజన్ కేంద్రంలో పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డిని మరియు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిలను, తొర్రూర్ పట్టణ కేంద్రంలోని స్థానిక వర్కింగ్ జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిచినందుకు అభినందనలు తెలిపి పుష్ప గుచ్ఛంను అందించి జర్నలిస్టుల సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గం ఇంచార్జ్ ఝాన్సీ రెడ్డిలు సంయుక్తంగా మాట్లాడుతూ ప్రభుత్వానికి మరియు ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యవంతం చేయడంలో మీడియా పాత్ర ఎనలేనిదని కొనియాడుతూ పట్టణ కేంద్రంలో వర్కింగ్ జర్నలిస్టులు ఎలాంటి వేతనం లేకుండా వివిధ పత్రికలలో పనిచేస్తూ అద్దె ఇండ్లలో ఉంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్న జర్నలిస్టుల సమస్యలను త్వరలోనే పరిష్కరించడం జరుగుతుంది. అని తెలుపుతూ అర్హులైన ప్రతి జర్నలిస్టుకి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్టులు కొమ్ము దేవేందర్, వెల్తూరి పూర్ణ రామచందర్, మహమ్మద్ అమీర్, పెండోట కిషన్ రావు, నల్లపు రాజు, ధారావతు రాజేందర్,బందు మహేందర్, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

## చావు బ్రతుకుల మధ్య పసికందు

**చౌటుప్పల్, విశాలభారతి:** మండలంలోని చింతల గూడెం గ్రామానికి చెందిన కొమురెల్లి రాజశేఖర్ రెడ్డి, హేమలత వృత్తి కౌలు రైతు వీరికి ఇద్దరు పిల్లలు కోమిరెల్లి నిహంత్ రెడ్డి, పాప కోమిరెల్లి దాక్ష (5 నెలలు)అయితే పాప పుట్టిన 4 రోజులకే తండ్రి అప్పుల బాధ వలన హత్మహత్య చేసుకోవడం జరిగింది. ఇప్పుడు పాప కోమిరెల్లి దాక్ష 25 రోజుల నుండి హైదరాబాద్ హాస్పిటల్ లో నిమ్మోనియ వ్యాధితో తీవ్ర అస్వస్థకు గురై చావు బ్రతుకుల మధ్యలో కొట్టుమిట్టాడుతుంది. వారి కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నారు. కావున దాతలు ఎవరైనా ఉంటే ముందుకు వొచ్చి తమ కూతురును బ్రతికించగలరని వారి కుటుంబం పత్రిక ముఖనా ప్రాదేయపడుతున్నారు. పాప తల్లి పేరు పోచమ్మల హేమలత,phone pye ,G pye no:8555814925 కు ఆర్థికసాయం అందించాలని కోరుతున్నారు.




## బీజేపీని గద్దె దింపుదాం

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున రెడ్డి

**సూర్యాపేట, విశాలభారతి :** కార్మిక,కర్షక వర్గం ఐక్యమై కేంద్రంలో బిజెపిని గద్దెదించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జున రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్ లో సిఐటియు, తెలంగాణ రైతు సంఘం, తెలంగాణవ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక, కర్షక ఐక్యత జిల్లా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక , రైతు , ప్రజా వ్యతిరేక విధానాల వలన అవలంబిస్తున్న కార్పొరేటు మతోన్మాద విధానాల మూలంగా దేశంలోని కార్మిక వర్గం రైతాంగం పేద ప్రజలందరూ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా కుదించడం జరిగిందని సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తుందని విమర్శించారు.అదేవిధంగా రైతులకు ఉరితాడు బిగించే విధంగా తీసుకొచ్చిన 3 రైతు వ్యతిరేక నల్ల చట్టాలను దేశంలోని రైతాంగం పోరాటం ద్వారా వెనక్కి తీసుకున్నట్టే తీసుకొని మళ్లీ వాటి అమలకు ప్రయత్నంకొనసాగిస్తుందనిఆరోపించారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర కల్పించకుండా రైతులను మోసం చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా గత యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ను తగ్గించి వ్యవసాయ కార్మికులను మోసం చేస్తుందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయిన కూడా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిత్యవసర సరుకుల ధరలను విపరీతంగా పెంచుతూ పేదలపై భారాలు మోపుతూ అనేక సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ కార్పొరేటు కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టిందన్నారు. సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శినెమ్మాది వెంకటేశ్వర్లు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిమట్టిపల్లి సైదులు,రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్చెరుకు ఏకలక్ష్మి,రైతు సంఘం జిల్లా నాయకురాలు కొప్పుల రజిత, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, పల్లె వెంకట్ రెడ్డి, బెల్లంకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడినా వారికే ఉన్నత పదవులు

ఎమ్మెల్సీగా ఎన్.ఎస్.యు.ఐ. బల్మూరి వెంకట్



**మునగాల ,విశాలభారతి:** సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన ఎన్.ఎస్.యు.ఐ. మునగాల మండలం అధ్యక్షులు గోగుల లక్ష్మణ్ ఎన్.ఎస్.యు.ఐ. రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్ కి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించినందుకు ఏఐసిసి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ విద్యార్థి నాయకులు గోగుల లక్ష్మణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేసిన వారికి అధిష్టానం గుర్తించి సముచిత స్థానం కల్పించి బడుగు బలహీన వర్గాల కోసం పనిచేసే ప్రభుత్వం అని నిరూపించుకున్న కాంగ్రెస్ పార్టీ అని తెలియజేశారు.



## రైస్ మిల్లుపై చర్యలు తీసుకోవాలి

అధికారులు స్పందించాలని డిమాండ్

**చిట్యాల, విశాలభారతి:** మండలంలోని వట్టిమర్తి గ్రామపంచాయతీ పరిధిలోని వ్యర్థ జలాలను వాయిళ్ళ బాయి కుంటలోకి విడుదల చేస్తున్న హనుమాన్ రైస్ ఇండస్ట్రీ యాజమాన్యంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి ఎండి అక్బర్ డిమాండ్ చేశారు. సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు వాయిల్ల బాయి కుంటను పరిశీలించడం జరిగింది. ఈ కుంటలోకి హనుమాన్ రైస్ ఇండస్ట్రీ నుండి వ్యర్థ జలాలు కుంటలో కి రావడం వల్ల నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయని, భూగర్భ జలాలు కలుస్తామవుతున్నాయని.ఈ కలుషిత నీరు తాగిన పశువులు, గొర్రెలు మేకలు అనేక జబ్బులకి గురై మరణిస్తున్నాయని, ఈ నీటి వల్ల వచ్చే దుర్వాసనతో ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారని దీనిపై స్థానిక ఎమ్మార్వో, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి సంబంధిత యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్కే షరీఫ్, వ్యవసాయ కార్మిక సంఘం
మండల అధ్యక్షుడు బోలుగూరి లింగయ్య, సీనియర్ నాయకులు దేశ గాని బాలరాజు, మేకల బిక్షం, కురావుల చిన్న వెంకన్న, సత్తయ్య,పి దేవేందర్ తదిత



## బ్లాస్టింగ్ క్రషర్ నిర్వహణపై విచారణ

**పొల్యూషన్, గ్రామపంచాయతీ పర్మిషన్ లేదు**

**సూర్యాపేట, విశాలభారతి:** ఆత్మకూరు ఎస్ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కేఎస్ఆర్ పెద్దగుట్ట బ్లాస్టింగ్ పై గ్రామస్తులు, రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు శాఖల అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఎలాంటి అనుమతులు లేకుండా క్రషర్ నిర్వహణ చేపడుతున్నారని, పెద్ద పెద్ద బ్లాస్టింగులు పెట్టడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బోర్లు పూడి పోతున్నాయంటూ ఇప్పటికే పలుమార్లు రైతులు, గ్రామస్తులు వివిధ శాఖల అధికారులతో పాటు నాయకులకు ఫిర్యాదు చేశారు. కాగా ఇటీవల అధికార పార్టీకి చెందిన కాకి దయాకర్ రెడ్డి కాంస్య విగ్రహ ఏర్పాటుకు మండల కేంద్రానికి వచ్చిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డికి ఫిర్యాదు చేయడంతో వెంటనే ఆయన సంబంధిత అధికారులను విచారణ చెపట్టాల్ని ఆదేశించారు. దీంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, మైనింగ్ శాఖ,రెవెన్యూ శాఖ అధికారులు పెద్దగుట్ట పరిసరాలను పరిశీలించి కొంతమంది రైతులతో మాట్లాడి వివరాలు బ్లాస్టింగ్ పర్మిషన్ లేదని, అదేవిధంగా ఇవి మొత్తం మీద ఎంక్వయిరీ చేసి తప్పు తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ విషయంపై క్రషర్ మిల్ యజమాని కోనతం సత్య నారాయణ రెడ్డిని మీడియా సంప్రదించగా అన్ని అనుమతులు ఉన్నాయని, ఇది రాజకీయ లో బాగం అని అధికార పార్టీ నాయకులు వెనక ఉండి ఈ పని చేయిస్తున్నారు తప్ప నేను ఎలాంటి తప్పు చేయలేదని విచారణలో తప్పు చేసినట్లు తేలితే దేనికైనా సిద్ధంగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాకి కృపాకర్ రెడ్డి,పందిరి మాధవరెడ్డి, పందిరి రాంరెడ్డి , గిలకత్తుల ఎల్లయ్య ,శ్రీను, బట్టిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



## క్యాలెండర్ ఆవిష్కరణ

**చిట్యాల, విశాలభారతి:** మండల ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్గొండ జిల్లా ఫోటో వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ను చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్నవెంకట రెడ్డి ఆవిష్కరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు ఏళ్ల బయ్యాన్న, జిల్లా సహాయకార్యదర్శి ముప్ప సుఖేందర్ రెడ్డి,మండల అధ్యక్షులు ఆవుల ఆనంద్, ప్రధానకార్యదర్శి కూరకుల సుధీర్, కోశాధికారి నల్ల నర్సిరెడ్డి, కుటుంభ భరోసా ఇంఛార్జి దేవనబోయిన సైదులు, మెండే నర్సింహ, నూనె యాదగిరి,కన్నెబోయిన నరేందర్ యాదవ్, గుండాల లింగస్వామి తదితర సభ్యులు పాల్గొన్నారు.



## జగనన్న సురక్ష రెండవ దశ ప్రారంభం

**కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గుండాల ఎంపిటిసి**

**భద్రాచలం, విశాలభారతి:** ఎటపాక మండలం గుండాల గ్రామ సచివాలయ పరిధిలో పినపల్లి జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో స్థానిక సర్పంచ్ గుండి సీతా లక్ష్మి ఆధ్వర్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, జగనన్న సురక్ష ప్రోగ్రాంకు గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా గుండాల ఎంపిటిసి మాట్లాడుతూ సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని పేదలందరికీ ఆరోగ్య భరోసా కల్పించాలని లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో పట్టణాలకే పరిమితమైనటువంటి వైద్యాన్ని, మన ప్రభుత్వం వచ్చాక, 108, 104, ద్వారా వైద్యాన్ని అందించడమే కాకుండా, ఏఎన్ఎంలు మెడికల్ సిబ్బంది నేరుగా ఇంటికి వెళ్లి, వైద్య సేవలు అందించడం జరుగుతుంది అని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ కూడా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న రెండవ దశ హెల్త్ క్యాంప్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి, గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, ఉప సర్పంచ్,తోట శశి కుమార్, కన్వీనర్ పాల్గొన్నారు.



## ప్రాజెక్టు పనులు వెంటనే పూర్తి చేయిస్తాం

**ఐబి ఈఈ విజయకుమార్**

**శాలిగౌరారం, విశాలభారతి:** అసంపూర్తిగా ఉన్న శాలిగౌరారం ప్రాజెక్టు పనులను కాంట్రాక్టర్ తో వెంటనే పూర్తి చేయిస్తామని నీటిపారుదల శాఖ ఈ ఈ విజయ్ కుమార్ అన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం శాలిగౌరారం ప్రాజెక్టు ను అయన పరిశీలించారు.ఐదు కోట్ల పది లక్షల రూపాయలకు గాను,రెండు కోట్ల 30 లక్షల రూపాయల పనులు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన పనులను దశల వారీగా రైతులకు ఇబ్బంది లేకుండా, ప్రాజెక్ట్ షట్టర్లు బిగించి నీటిని నిలువ చేస్తామన్నారు. ఐదు కోట్లలో ఎలాంటి అవినీతి జరగలేదని పనులు పారదర్శకంగా జరుగుతున్నాయన్నారు .

ఈ కార్యక్రమంలో ఐబిడిఈ సత్యనారాయణ, జెఈ అమర్, ఏఈ మేడి రాములు, రైతు చామల వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంజాపూర్‌లో కొలిక్కి రాని రోడ్డు పంచాయితీ

- **రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న పట్టాదారులు**
- **పెట్రోల్ పోసుకొని మహిళ ఆత్మహత్యాయత్నం**





**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంజాపూర్‌తొర్రూరు రోడ్డు విషయమై గతకొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ రోడ్డు విషయమై ఇరువర్గాల మధ్య గతం నుంచి గొడవలున్నాయి. ఇరువర్గాలు కోర్టు నుంచి ఉత్తర్వులు తెచ్చుకోవడంతో పంచాయితీ పెద్దదైంది. తాజాగా కోర్టు ఉత్తర్వుల మేరకు శుక్రవారం పోలీసుల సహకారంతో ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డువేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న రెండువర్గాల మద్దతుదారులు ఘటనాస్థలి వద్ద భారీగా గుమిగూడారు. గ్రామనక్ష ప్రకారం రోడ్డువేయాలని ఓ వర్గం ఆందోళనకు దిగింది. అధికారులు పట్టాభూమి నుంచి రోడ్డు వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే తరుణంలో ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేయడంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. వెంటనే స్పందించిన పోలీసులు మహిళను అడ్డుకున్నారు. ఆందోళనకారులను అరెస్ట్ చేసి అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పోలీసుల సహకారంతో ఆర్అండ్‌బీ ఈఈ, రెవెన్యూ అధికారులు మళ్లీ రోడ్డు వేసేందుకు యత్నించారు. అధికారులతో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తీవ్ర వాగ్వాదానికి దిగారు. దీంతో పనులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ ఈఈ శ్యాంప్రకాశ్ మాట్లాడుతూ తమకు వచ్చిన అనుమతుల ప్రకారం ఏడు మీటర్ల విస్తీర్ణంలో రోడ్డు వేస్తున్నామన్నారు. పట్టాదారులకు ఎలాంటి నష్టం జరగకూడదన్నదే తమ ఉద్దేశమన్నారు. రెండు వైపుల పట్టాదారులు ఒప్పుకుంటే నక్షరోడ్డుకు ఇరువైపులా 20 మీటర్ల విస్తీర్ణంలో రోడ్డు వేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రోడ్డు నిర్మాణానికి గ్రామస్థులు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్ దత్తు, ఆర్అండ్‌బీ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, మండల సర్వేయర్ జ్యోతి, వనస్థలిపురం సీఐ వెంకట్ , ఎస్ఐ జగన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## 'రైతును రాజు చేయడమే లక్ష్యం'



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు అందజేశారు. రంగారెడ్డి జిల్లా పరిధిలో వ్యవసాయాన్ని, రైతులను లాభసాటిగా మార్చే విషయమై మంత్రితో మాట్లాడినట్లు సత్తయ్య వెల్లడించారు. రైతాంగ సంక్షేమం కోసం పని చేస్తామన్నారు. రైతులకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలను రూపొందిస్తామని చెప్పారు. సత్తయ్య వెంట రాజుబాబు, ఆర్లకృష్ణ తదితరులు ఉన్నారు.



## ఫిబ్రవరి 8 నుంచి 10 వరకు గీతం ప్రమాణ

**లోగో ఆవిష్కరణలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు**

**ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు**





**పటాన్‌చెరు,విశాలభారతి:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ లో ప్రతియేటా నిర్వహించే మూడు రోజుల సాంకేతిక, సాంస్కృ తిక, యాజమాన్య (టెక్నో, కల్చరల్, మేనేజ్మెంట్ ఫెస్ట్) పండుగ ఈ ఏడాది ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు అలరించనున్నది. ఈ విషయాన్ని ఫెస్ట్ కన్వీనర్ డాక్టర్ సి.త్రినాథరావు శుక్రవారం వెల్లడించారు. ఈ ఫెస్ట్ ప్రచారంలో భాగంగా, నవీకరించిన లోగోను ఇటీవల ఆవిష్కరించినట్టు ఆయన తెలిపారు. ప్రమాణ లోగో ఆవిష్కరణ సందర్భంగా గీతం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు (శాస్త్రీయ, జానపద, సామూహిక నృత్యాలను) ప్రదర్శించినట్టు ఆయన పేర్కొన్నారు. ట్రయాడ్ బ్యాండ్ ప్రదర్శన ఈ ఉత్సవానికే తలమానికంగా నిలిచి, ఆహూతులందరినీ అలరించిందన్నారు. లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో దాదాపు 1500 మంది గీతం విద్యార్థులు చురుకుగా పాల్గొని, ప్రమాణ2024 ఉత్సవ నిర్వహణ కోసం తమ ఉత్సుకతను ప్రదర్శించినట్టు డాక్టర్ త్రినాథ రావు తెలియజేశారు. ఈ మొత్తం కార్యక్రమాన్ని స్టూడెంట్ లెఫ్ట్ బృందం పర్యవేక్షించి, సమన్వయం చేసిందన్నారు. గీతం, హైదరాబాద్ సాంకేతిక, సాంస్కృతిక, మేనేజ్మెంట్ వేడుకల కోసం వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులను ఒకచోట చేర్చి, ఆకర్షణీయమైన, మరపురాని ప్రమాణ 2024ని ఘనంగా నిర్వహించడానికి సన్నద్ధం చేసినట్టు పేర్కొన్నారు.

## పొదెం వీరయ్యని మంత్రిని చేయాలి

**ఆదివాసి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి**



**భద్రాచలం, విశాలభారతి:** తెలంగాణలో రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో భద్రాచలం ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేధావి ఆదివాసి నేత ఉదయం వీరయ్య కు ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవిని కట్టబెట్టాలని మహాజనసమితి ఆదివాసి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు కంగాల రమణకుమారి డిమాండ్ చేశారు..ఈ సందర్భంగా ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ భద్రాచలం ప్రాంతం తెలంగాణ ఆంధ్ర విభజన తరువాత అభివృద్ధి కుంటుపడిందని భద్రాచలం భూభాగం మొత్తం ఆంధ్రలో కలవడం వలన ఆదివాసీల ప్రాబల్యం తగ్గిందని విభజన నుండిఆంధ్రాలో కలిసిన ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని డిమాండ్తో ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టిన ఉపయోగం లేకుండా పోయిందని ఆమె ఆవేదన చెందారు. విభజన శాస్త్రీయ బద్దంగా జరగలేదని ఇక్కడ నివసిస్తున్న ప్రజానీకం యొక్క అభిప్రాయ సేకరణ చేయకుండా విభజన చేయటం వలన భద్రాచలం ప్రాంతం రాములవారి ప్రత్యేకత దెబ్బ తింటుందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడేరు కాకినాడ విజయవాడ వంటి సుదీర్ఘ ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని ఆర్థిక భారంతో విద్యార్థులు మనోవేదనకు గురవుతున్నారని సర్టిఫికెట్స్ కోసం కూడా ఘాటి రోడ్డు నుండి ప్రయాణం చేయాల్సి వస్తుందని నిరుపేద విద్యార్థిని విద్యార్థులు గోస అరణ్య రోదనగా మారుతుందని ఆమె వాపోయారు ఉన్న ఎమ్మెల్యే కు అధికార పక్షం లేకపోవడం వలన ఆయన పదవి నిరుపయోగంగా మారిందని ఆమె అన్నారు తక్షణమే వీరయ్యను ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రిగా పదవిని ఇవ్వటం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధి కోసం మనుగడ కోసం ఆయన కృషి చేస్తారని ఆమె ప్రభుత్వాన్ని కోరారు.



## బీఆర్ఎస్ మెదక్ పార్లమెంటు సమావేశం

**పాల్గొన్న కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**



**పటాన్ చెరు విశాలభారతి :** మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు శుక్రవారం తెలంగాణ భవన్ లో మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాల సన్నాహక సమావేశం నిర్వహించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటిఆర్, మాజీ మంత్రి హరీష్, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తదితరులు హాజరైన సమావేశంలో భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రామచంద్రపురం కార్పొరేటర్ బురుగడ్డ పుష్ప నగేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీ. ఆదర్శ్ రెడ్డి, పర్మేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని కలిసిన జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి,విశాలభారతి:** కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వ స్థాపన ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి ముందడుగు పడిందని,మున్ముందు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధి,సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్ ఆకాంక్షించారు.శుక్రవారం తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ను కలిశారు.ఈ మేరకు ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందేవిధంగా ప్రభుత్వ దవాఖానల అభివృద్ధి పనులు చేపట్టాలని వారిని జగదీశ్వర్ గౌడ్ కోరారు. దానికి మంత్రి సానుకూలంగా స్పందించి అవసరమైన అన్ని రకాల సహాయ సహకరాలు అందిస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తకు తదితరులు పాల్గొన్నారు.





## మత సామరస్యానికి ప్రతీక ఉర్సు ఉత్సవాలు

**కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీక అని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు.శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని గోపినగర్ లో భక్తుల ఆరాధ్య దైవంగా భావించే "ఖ్వాజ గరీబ్ నవాజ్" దర్గా ఉర్సు ఉత్సవాలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి.గోపినగర్ లోని "ఖ్వాజ గరీబ్ నవాజ్" దర్గాలో నిర్వహించిన ఉర్సు ఉత్సవాల్లో ముఖ్య అతిదిగా పాల్గొని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఉర్సు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నాగేందర్ యాదవ్ ను శాలువా,పూల మాలల తో ఘనంగా సత్కరించారు.ఈ నేపథ్యంలో కార్పొరేటర్ సమక్షంలో "గంధం" (సంధల్) ఊరేగింపు భక్తిశ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా దర్గాలో ప్రత్యేక చాదర్ సమర్పించారు. అనంతరం కార్పొరేటర్ రాగం మాట్లాడుతూ తెలంగాణ లో మతసామరస్యం వెల్లి విరిసెలా ఉర్సు ఉత్సవాలు జరుపుకోవడం ఎప్పటినుంచో వస్తున్న ఆనవాయితీ అని ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు వీరేశం గౌడ్,మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, గోపినగర్ బస్తీ అధ్యక్షులు గోపాల్ యాదవ్, షేక్ రజాక్, రయాజ్,మొహమ్మద్ దస్తగిర్, వార్డ్ మెంబర్ పర్వీన్ బేగం, షకీల్,దేవులపల్లి శ్రీకాంత్, నర్సింహా, సత్యనారాయణ, మహేందర్ సింగ్,షేక్ ఖాజా, షేక్ నవాజ్, ఫకృద్దీన్, ఇజాజ్, ఇలియాజ్,ఎండి జానీ,అబ్దుల్ గని,మొహమ్మద్ జాకీర్, మహమ్మద్ చాంద్, మొహమ్మద్ అజంఖాన్, షేక్ నూర్, మొహమ్మద్ జాఫర్, మొహమ్మద్ అక్బర్, ఖాదర్, అలీం,నదీమ్,కుమార్,సురేష్, విట్టల్,రవి,శ్యామ్,లడ్డు,దివ్య తదితరులు పాల్గొన్నారు.



# 2 కోట్ల పనులను బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన

**నాచారం, విశాలభారతి:** మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో సుమారు 2 కోట్ల అంచనా వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అంతే కాకుండా పేద వాళ్లకు విద్యా, వైద్యం లాంటి ప్రధాన సమస్యలు ఎవున్నా తన వంతు సహకారం తప్పకుండా అందిస్తామని అన్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే గారికి మరియు డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామని అన్నారు. ఆయా కాలనీల నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే గారికి మరియు కార్పొరేటర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పనుల వివరాలు 1. తిరుమలనగర్, 2. హెచ్ బీ కాలనీ ఫేజ్ 1 గ్రౌండ్ దగ్గర 3. మంగాపురం వేంకటేశ్వర స్వామి వారి ఆలయం దగ్గర, మొత్తం మూడు సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అభివృద్ధి పనులు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇనస్పెక్టర్ చారి, వాటర్ వర్క్స్ వేణు గోపాల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంక్షేమ సంఘ నాయకులు, ఆయా కాలనీల నాయకులు, నాయకులు గుమ్మడి జంపాల్ రెడ్డి, మల్లేష్ గౌడ్, ప్రతాపరెడ్డి, అశోక్ రెడ్డి మరియు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రజా పంపిణీ బియ్యం పట్టివేత

**గరిడేపల్లి,విశాలభారతి :** అక్రమంగా తరలిస్తున్న ప్రజా పంపిణీ బియ్యాన్ని పట్టుకున్న సంఘటన శుక్రవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలో జరిగింది. స్థానిక ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున సమయంలో గరిడేపల్లి మండల పరిధిలోని గడ్డిపల్లి వైపు నుండి ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నదని విశ్వసనీయ సమాచారం మేరకు పొనుగోడు క్రాస్ రోడ్ లో వాహన తనిఖీ చేస్తుండగా ఒక డిసిఎం వాహనం అనుమానస్పదంగా వచ్చింది. ఆయా వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా దానిలో 24 క్వింటాల ప్రజాపంపిణీ బియ్యం ఉంది. ప్రజా పంపిణీ బియ్యాన్ని పట్టుబడి చేసి అట్టి వాహనం డ్రైవరు జిల్లపల్లి సంజీవపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేయడం జరుగుతుందని యస్ ఐ వెంకట్ రెడ్డి తెలిపారు.ఈ తనిఖీలో యస్ ఐ పి.వెంకట్ రెడ్డి తో పాటుగా సిబ్బంది నగేష్, యువరాజు,సైదులు లు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోని జాతీయ రహదారి 65 పై జరిగిన రోడ్డు ప్రమాదం లో వ్యక్తి మృతి చెందడం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామన్నపేట మండలం తుమ్మల గూడెం గ్రామానికి చెందిన రాదారపు మల్లేష్ వయసు 40, పెద్దకాపర్తి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఇరుగు రవికుమార్ తెలిపారు.

# చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు



**విశాలాభారతి, కొత్తూరు:** చెపలకు వెళ్లిన వ్యక్తి చెరువులో గల్లంతయ్యాడు. ఈ ఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడ గ్రామనికి చెందిన మైలరం ఈశ్వర్ గౌడ్ గురువారం రాత్రి పశువులకు మేత వెళ్లి పక్కనే ఉన్న గోధుమ చెరువు లో చేపలు పడుతుంటాడు. గురువారం రాత్రి కూడా అల్లాగే వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు ఎన్డీఆర్ఎఫ్ బృందం శుక్రవారం మధ్యాహ్నం నుండి గాలింపు చర్యలు చేపట్టగా తాసిల్దార్ జానకి, సీఐ నర్సింహా , పర్యవేక్షణలో గాలింపు చర్యలు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ఈశ్వర్ కి సంబంధించిన ఆచూకీ లభించలేదు..



# కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారిని పరామర్శించినా ఉప్పల్ ఎమ్మెల్యే

**నాచారం, విశాలభారతి;** రామ్ రెడ్డి నగర్ లో నివసించే సంతోష్ , సంధ్య కూతురు కృతి ఇంటిముందు ఆడుకుంటూ ఉండగా కుక్క దాడి చేసి చిన్నారి మోహం ,చెవి దగ్గర పలు చోట్ల కాటు వేసీ తీవ్రముగా గాయపరిచింది.ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మలక్ పేట యశోద హాస్పిటల్ కి వెళ్లి అ చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, బన్నాల ప్రవీణ్, హబ్సి గూడ డివిజన్ ప్రెసిడెంట్ బీవీ చారీ , ప్రధాన కార్యదర్శి సోమి రెడ్డి, కాలేరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సర్వే చేయాలి

**భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి**



**షాబాద్, విశాల భారతి:** రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం సర్వే చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని నాగర్ గూడ కృష్ణ దేవాలయం ఆవరణలో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భూసమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ధరణీ పేరును గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే భూముల సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు. కమతాల ఏకీకరణ చేస్తే 30 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రైతులు ప్రధానంగా విద్యుత్, రెవెన్యూ, మార్కెటింగ్ సమస్యలు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షులు గరిగె గజెందర్ గౌడ్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన పురుషులు ఎవరైనా సభ్యులుగా చేర్చుకుంటే వారి సమస్యలపై కూడా పోరాటం చేసి న్యాయం చేస్తామన్నారు. జసేందుకు అర్హత ఉంటుందని చెప్పారు. భూమిలేని వీరు పేదలను సైతం సభ్యులుగా చేర్చుకుంటే వారి సమస్యలపై కూడా పోరాటం చేసి న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాదవరెడ్డి, పాలమూరు జిల్లా కార్యదర్శి నరేదర్రెడ్డి, మొయినాబాద్ద లేవెళ్ల, శంకర్పల్లి, షాబాద్, శంషాబాద్, కొందుర్గు చైదరూడ, షాద్నగర్ మండలాల అధ్యక్షులు కార్యదర్శులు, భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు తదితరులున్నారు.



# రమేష్ ని పరామర్శించిన సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి

**కల్వకుర్తి, విశాల భారతి:** మండల పరిధిలోని పంజుగుల గ్రామానికి చెందిన మండల యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పర్శపాకుల రమేష్ ఇటీవల లారీ యాక్సిడెంట్ కి గురయ్యారు. ఈ విషయం తెలుసుకొని నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుంకిరెడ్డి వరప్రసాద్ రెడ్డి ఆయన్ను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు. తక్షణ ఆర్థిక సహాయంగా రూ.10 వేలు కుటుంబ సభ్యులకి అందజేశారు. డాక్టర్ లతో మాట్లాడి మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. వీరితో పాటు యువజన కాంగ్రెస్ తాలుకా అధ్యక్షులు రాపోతు అనిల్ గౌడ్, కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసుదేవా రెడ్డి లు ఉన్నారు.



# శ్రీరాముని కాషాయ జెండాలు పంపిణీ

**కల్వకుర్తి, విశాల భారతి:** అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం జరుగుతున్న సందర్భంగా జనవరి 22వ తేదీన భక్తులు తమతమ ఇండ్లపై కాషాయ జెండా ఎగురవేయాలని కల్వకుర్తి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త గుర్రాల రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీరామ చిత్రపటంతో ఉన్న 516 కాషాయ జెండాలను హిందూసంఘాలైన ఆర్ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్ బిజేపి నాయకులకు అందజేశారు. కల్వకుర్తి పట్టణం అంతా కాషాయ జెండాలతో అలంకరిద్దామని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గ ప్రసాద్, వివేకానంద్, ఆంజనేయులు, దయాకర్, నర్సిరెడ్డి, బాబీదేవ్, దామోదర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



# మైనార్టీల సంక్షేమానికి మా వంతు కృషి చేస్తాం

**షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాష్రెడ్డి రెడ్డి**

**షాబాద్, విశాల భారతి:** మైనార్టీల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని షాబాద్ జెడ్పీటీసీ పట్నాల అవినాష్రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రపల్లి గ్రామంలో చర్గా మరమ్మతుల కోసం ప్రహరీగోడ నిర్మాణానికి ఎంపీ గడ్డం రంజిత్రెడ్డి కోటా కింద రూ. 10 లక్షల నిధులతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ముస్లింల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజలకు సముచిత ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నక్క శ్రీనివాస్ గౌడ్, నాయకులు పీసరి రాజేశ్వర్రెడ్డి సుధాకర్రెడ్డి ప్రభాకర్రెడ్డి, వినయ్ రెడ్డి, రాములు గోపాల్, ముస్లిం సోదరులు తదితరులున్నారు.



# గడపగడపకు శ్రీరాములవారి అక్షింతలు

**ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు..**

**సైదాపూర్, విశాల భారతి:** వందల సంవత్సరాల నిరీక్షణ అనంతరం అయోధ్యలో భవ్య శ్రీరామమందిర నిర్మాణం జరుగుతుందని.. జనవరి 22న జరిగే బాల రాముని విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం యావత్ హిందూ సామాజానికి గోప్ప పర్వదినమని పలువురు గర్రెపల్లే గ్రామస్థులు తెలిపారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సోమారం గ్రామ పరిధిలోని గర్రెపల్లేలో శుక్రవారం గడపగడపకు అయోధ్య నుండి వచ్చిన శ్రీరాముని పూజిత అంక్షింతలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆ అక్షింతలతో జైశ్రీరామ్ అంటు నినాదాలు చేస్తూ ఇంటింటికి అందజేయగా గ్రామస్థుల నుండి విశేష స్పందన లభించింది. రాముడి విగ్రహ ప్రతిష్ఠకు గర్రెపల్లే నుండి పెద్ద ఎత్తున వేల్లేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరక్టర్ కౌడగాని మోహన్ రావు, మాజీ ఉపసర్పంచ్ దాసరి రవీందర్, అరేకుల సంక్షేమ సంఘం ఆధ్యక్షులు దూకిడి తిరుపతి గ్రామస్థులు, భక్తులు తదితరులు పెద్దఎత్తున పాల్గోన్నారు.



# జనవరి 22న సెలవు ప్రకటించాలి

**నారాయణఖేడ్, విశాల భారతి:** జనవరి 22న అయోధ్యలోని రామాలయంలో శ్రీరామ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం జరుగుతున్న సందర్భంగ సంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలకు సెలవు ప్రకటించాలని జిల్లా కలెక్టర్ కి తపస్ సంగారెడ్డి జిల్లా బృందం కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తపస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివప్ప జిల్లా బాధ్యులు రాములు, అంతయ్య, శ్రీనివాస్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.




# బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పి పని చేస్తోంది

**షాబాద్, విశాల భారతి:** బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పి పని చేస్తోందని బీఎస్పి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాగిల్ల దయానందరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ ఆర్య పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని పీటర్ఆర్ మినీ స్టేడియంలో బీఎస్పి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం బీఎస్పీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా కర్రె శ్రీశైలంను నియమించి నియమక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఎస్పి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు బహుజన రాజ్యాంలో ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందన్నారు. బహుజనులమంతా కలుద్దాం నిలుద్దాం గెలుద్దాం అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుండి విద్యుత్ సరఫరాకు అంతరాయం

**షాబాద్, విశాల భారతి:** షాబాద్ మండలంలో నేటి నుండి అన్ని సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ నరేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లలోని పవర్ ట్రాన్స్ ఫార్మర్లు, బ్రేకర్ల మరమ్మతులు, వైర్లకు తగులుతున్న చెట్ల తొలగింపు కారణంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20వ తేదిన పోతారం సబ్ స్టేషన్, 22, 23, 24, 25, 27వ తేదిన తాళపల్లి సబ్ స్టేషన్, 28వ తేదిన చందనవెల్లి సబ్ స్టేషన్, 29, 30, 31, ఫిబ్రవరిలో 01022024, 02.08:04,05,06,07,08వ తేదీలల్లో బొచ్చిలిగామ, అంతారం సబ్ స్టేషన్ల ల్లో, 09, 10, 11వ తేదీలల్లో హైరాబాద్, చందనవెల్లి, ఇండస్ట్రియల్ పార్క్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.


TPUS



# అయోధ్యకు చేరుకున్న సంగ్రామ్ మహారాజ్..

**నారాయణఖేడ్, విశాల భారతి:** నారాయణఖేడ్ మండల పరిధిలోని కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రామ్ మహారాజ్ అయోధ్య శ్రీరామ్ మందిర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరు కావడానికి శుక్రవారం అయోధ్య చేరుకున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గం నుండి తెలంగాణ రాష్ట్ర సాధు సంతుల ప్రతినిధి సంగ్రామ్ మహారాజ్ అయోధ్య దివ్య భవ్య రామ మందిర ప్రారంభ కార్యక్రమానికి వెళ్లడంతో ఇక్కడ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# అయోధ్య పూజిత శ్రీరామ అక్షింతల వితరణ

**షాబాద్, విశాల భారతి:** అయ్యోధ్య రామ మందిర అక్షింతలను ఇంటింటా పంపిణీ చేస్తున్నట్లు ముద్దెంగూడ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, మాచన్ పల్లి, సంకెపల్లిగూడ సర్పంచ్ లు మహేందర్ రెడ్డి, కుమ్మరి దర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని మాచన్ పల్లి, సంకెపల్లిగూడ గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఇంటింటికీ అక్షింతల పంపణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని హిందువుల గృహాలకు చేర్చాలని శ్రీరామ తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్ణయించింది. ఆ అక్షింతలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజేందర్ రెడ్డి, నాయకులు కూతురు మహేందర్, సత్యం, రామస్వామి, రాంచంద్రయ్య, గిరీష్, రాములు, శ్రీశైలం, నవీన్, గ్రామస్తులు తదితరులున్నారు.



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
సినిమా
www.vishalabharati.com
epaper:vishalabharati.com

శనివారం, 20.01. 2024 | హైదరాబాద్
vishalabharathi Telugu Daily



# 'మట్కా' ఇంటెన్స్ ఓపెనింగ్ బ్రాకెట్ విడుదల

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, పలాస 1978, శ్రీ దేవి సోడా సెంటర్ ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న 'మట్కా' చిత్రంతో పాన్ఇండియన్ అరంగేట్రం చేస్తున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మాత డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి SRT ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన ఓ భారీ సెట్ లో షూటింగ్ జరుపుకుంటోంది. మట్కా హై బడ్జెట్, అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో బిగ్ కాన్వాస్‌పై రూపొందుతోంది. వరుణ్ తేజ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మట్కా ప్రిమైజ్ ని చూపించడానికి ఓపెనింగ్ బ్రాకెట్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. కథానాయకుడు గ్రామోఫోన్‌లో మ్యూజిక్ ని ప్లే చేయడంతో ఇది ఓపెన్ అవుతుంది. ఇది రెండు వేర్వేరు టైమ్‌లైన్‌లలో పాత్రలని ప్రజెంట్ చేస్తోంది. నవీన్ చంద్ర గ్యాంగ్‌స్టర్‌గా కనిపించగా, పి రవిశంకర్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించాడు. కథానాయకుడు చైల్డ్ వుడ్ పోర్షన్ లో కబడ్డీ ఆడుతూకనిపించారు. అతను గ్యాంబ్లింగ్ మాఫియాకు అధిపతిగా ఎదుగుతాడు. సిగార్ తాగుతూ ఎవరికో ఫోన్‌లో 'ప్రామిస్' అనడం ఆసక్తికరంగా వుంది. క్లిప్‌లో వరుణ్ తేజ్‌ని పూర్తిగా చూపించనప్పటికీ, చాలా పవర్‌ఫుల్ క్యారెక్టర్‌ను పోషించడానికి అతను పూర్తిగా మేకోవర్ చేసుకున్నట్లు అర్థమైంది. అతని డ్రెస్సింగ్ 80ల నాటి ఫ్యాషన్ స్టయిల్ ని పోలి వుంది. వరుణ్ తన హావభావాలు, పవర్ ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఇంటెన్స్ ని తీసుకొచ్చారు. 'ప్రామిస్' అనే డైలాగ్ బలమైన ప్రభావాన్ని చూపుతుంది.



# సీక్వెల్ పై అంచనాలు పెంచిన రష్మిక..!

తెలుగు దర్శకుడు సందీప్ వంగ హిందీలో రూపొందించిన యానిమల్ సినిమా బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. బాక్సాఫీస్ వద్ద దాదాపుగా రూ.900 కోట్ల వసూళ్లు నమోదు చేసిన విషయం తెల్సిందే. భారీ విజయాన్ని సొంతం చేసుకున్న యానిమల్ కి సీక్వెల్ ఉంటుంది అంటూ ఇప్పటికే దర్శకుడు సందీప్ క్లారిటీ ఇచ్చాడు. సందీప్ తన తదుపరి సినిమాను ప్రభాస్ తో చేయబోతున్నాడు. స్పిరిట్ అనే టైటిల్ తో రూపొందబోతున్న ఆ సినిమా యొక్క షూటింగ్ ఈ ఏడాది చివర్లో ప్రారంభించి 2026 కి సినిమాను విడుదల చేసే అవకాశాలు ఉన్నాయి. ఇక బన్నీ తో కూడా సందీప్ వంగ సినిమా చేయబోతున్న విషయం తెల్సిందే. యానిమల్ సినిమా యొక్క సీక్వెల్ కి ఇప్పటికే 'యానిమల్ పార్క్' అనే టైటిల్ ని ఖరారు చేశాడు. యానిమల్ సీక్వెల్ పై రష్మిక మందన్న తాజాగా ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె మాట్లాడుతూ సీక్వెల్ లో తన పాత్ర కంటిన్యూ అవుతుందని క్లారిటీ ఇచ్చింది. యానిమల్ పార్క్ లో సందీప్ మరింత వైల్డ్ గా పాత్రలను కథను చూపించబోతున్నాడు అంది. అంతే కాకుండా యానిమల్ ని మించిన విజయాన్ని సీక్వెల్ సొంతం చేసుకునే విధంగా దర్శకుడు సందీప్ వంగ సినిమాను రూపొందించబోతున్నట్లుగా ఆమె పేర్కొంది. షూటింగ్ సమయంలో యానిమల్ పార్క్ కి సంబంధించిన కొన్ని సన్నివేశాలను నాకు చెప్పాడు. అందులో తన పాత్ర కూడా వైల్డ్ గా కనిపించబోతుందని చెప్పుకొచ్చింది. మొదటి పార్ట్ లో రష్మిక ను చాలా సింపుల్ అండ్ క్లాసీ లుక్ లో చూశాం. కానీ పార్ట్ 2 లో మాత్రం వైల్డ్ గా ఆమెను చూడబోతున్నామని తెలుస్తోంది. రష్మిక మందన్న ప్రస్తుతం పుష్ప 2 సినిమా తో పాటు రెండు లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటిస్తోంది. మరో వైపు హిందీలో కూడా యానిమల్ విజయం తర్వాత వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. కనుక ముందు ముందు రష్మిక మరింత బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి అంటూ సినీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



# #90's' నా కెరీర్ లో మెమరబుల్ గా నిలిచిపోతుంది

**: హీరో శివాజీ**

హీరో శివాజీ, వాసుకి ఆనంద్ సాయి ప్రధాన పాత్రలలో ఆదిత్య హాసన్ దర్శకత్వంలో రూపొందిన వెబ్ సిరిస్ '#90's' 'ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' . ప్రతి మధ్యతరగతి కుటుంబాన్ని ప్రతిబింబించే ఈ వెబ్ సిరిస్ ని ఎంఎన్ఓపీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై రాజశేఖర్ మేడారం నిర్మించ్రు. నవీన్ మేడారం సమర్పించారు. ఈటీవీ విన్'వేదికగా జనవరి 5 నుంచి స్ట్రీమింగ్ అవుతున్న ఈ వెబ్ సిరిస్ అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి ఘన విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో యూనిట్ గ్రాండ్ సక్సెస్ మీట్ ని నిర్వహించింది. సక్సెస్ మీట్ లో హీరో శివాజీ మాట్లాడుతూ.. #90's' ఒక్క ఎపిసోడ్ విన్నా ఓకే చేసే కథ ఇది. అంత బావుంది. నేను చేసిన 'మిస్సమ్మ' అప్పటికి ఇండియన్ టాప్ 50సినిమాల్లో ఒకటిగా నిలిచింది. ఇవాళ ఇండియన్ ఓటీటీలో టాప్5 లో ఉండటానికి అన్ని క్యాలిటీస్ వున్న వెబ్ సిరిస్ #90's. మంచి యంగ్ టీంతో కలసి ఈ సిరిస్ చేశాం. ఈ ఒక్క సిరిస్ తో ఐదు లక్షల సబ్ స్క్రైబర్స్ రావడం మాములు విషయం కాదు. ఆదిత్య అద్భుతంగా రాశాడు. ఈ సక్సెస్ క్రెడిట్ తనదే. #90's నా కెరీర్ లో మెమరబుల్ గా నిలిచిపోతుంది. ఇది ఫిలింలా కూడా విడుదల చేస్తారని అనుకుంటున్నాను. మంచి కంటెంట్ ని ప్రోత్సహించడానికి ఈ వేడుకకు విచ్చేసిన ఆర్పీ పట్నాయ్ గారికి ధన్యవాదాలు. టీం అందరూ అద్భుతంగా పని చేశారు. అన్ని పాత్రలకు మంచి పేరు వచ్చింది. వాసుకి గారు చాలా అద్భుతంగా నటించారు. ఈటీవీ విన్ కి కృతజ్ఞతలు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు'' తెలిపారు.

# 50 ఏళ్ళ సినీ ప్రయాణం పూర్తి చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను

**: ప్రముఖ నటుడు డా. నరేష్ వికె**



''నటుడిగా ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 50 ఏళ్ళు సినీ ప్రయాణం పూర్తి చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇదంతా ప్రేక్షకులు ప్రేమాభిమానాలు వలనే సాధ్యమౌతోంది. నా జీవితాంతకాలం సినీ పరిశ్రమకు సేవ చేస్తాను'' అన్నారు ప్రముఖ నటుడు డా. నరేష్ వికె. నటుడిగా డా. నరేష్ వికె సినీ ప్రయాణం మొదలై విజయవంతంగా 50 ఏళ్ళు పూర్తవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన విలేకర్లతో ముచ్చటించారు. ఊహ తెలిసినప్పటి నుంచి నాకు తెలిసిందల్లా కృష్ణ గారు, అమ్మ విజయనిర్మల గారి మేకప్ రూమ్, పొద్దున్నే మద్రాస్ లో వచ్చి కలిసే ప్రజలు, స్టూడియో వాతావణం.. ఇలా వీటి చుట్టూనే పెరిగాను. ఇదే నా జీవితం కావాలని కోరుకున్నాను. 9 యేటా 'పండంటి కాపురం' లాంటి అద్భుతమైన చిత్రంతో ఆరంగేట్రం చేశాను. అయితే బాల నటులుగా వచ్చిన వాళ్ళు హీరోలుగా సక్సెస్ కారని చెబుతుంటారు. ఈ భయం వుండేది. అయితే దాని గురించి పెద్దగా అలోచించలేదు. ఒక్క సినిమా హీరోగా నటిస్తే చాలని అనుకున్నాను. అనుకోకుండా..అమ్మగారి ప్రేమ సంకెళ్ళు, జంధ్యాల గారి నాలుగు నాలుగు స్తంభాలాట..ఇలా రెండు సినిమాలు వచ్చాయి. నాలుగు స్తంభాలాటతో నాకు అద్భుతమైన కెరీర్ స్టార్ట్ అయ్యింది. నా ఫస్ట్ ఇన్నింగ్స్ లో జంధ్యాల గారు, అమ్మ(విజయనిర్మల), విశ్వనాథ్ గారు, బాపు గారు, రమణ గారు, ఈవీవీ సత్యనారాయణ గారు, వంశీ గారు, రేలంగి నరసింహరావు గారు,.. ఇలాంటి మహనీయులతో కలసి పని చేసే అదృష్టం దొరికింది. వీరందరూ నా విజయానికి పునాది వేశారు. ఈ సందర్భంగా అందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఒక మంచి యాక్టర్ కావాలని పరిశ్రమలోకి వచ్చాను. ప్రతి సినిమాలో ఏదో ఒక కొత్తదనం ప్రయత్నించాను. ఎన్నో విజయవంతమైన చిత్రాలు చేశాను. అయితే రాజీపడి సినిమాలు చేయడం నాకు ఇష్టం లేదు. అద్భుతమైన విజయాలు వచ్చినప్పటికీ నేను అనుకున్న సినిమాలు చేయలేకపోతున్నాననే ఒక చిన్న నిరాశతోనే తొలి ఇన్నింగ్స్ ఎండ్ అయ్యింది. సెకండ్ ఇన్నింగ్స్ పలు వైవిధ్యమైన పాత్రలు వచ్చినపుడు నటుడు ఎస్వీ రంగారావు గారిని స్ఫూర్తిగా తీసుకుని చేశాను. పరిశ్రమలో ఓర్పు, క్రమ శిక్షణ చాలా అవసరం. ఇవి మా అమ్మగారి నుంచి నేర్చుకున్నాను. సెకండ్ ఇన్నింగ్స్ లో మీ శ్రేయోభిలాషి , గుంటూరు టాకీస్. అ ఆ, దృశ్యం చిత్రాలలో వివిధ్యమైన పాత్రలు రావడంతో నాకు పరిశ్రమలో కొత్త మెరుగు వచ్చింది. సెకండ్ ఇన్నింగ్స్ లో కొత్త, వైవిధ్యమైన రావడం అనందంగా వుంది. ఈ సందర్భంగా దర్శక, రచయితలందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఒక నటుడు పదేళ్ళు ఉండటమే గొప్ప. ఇంతమందికి ధన్యవాదాలు చెబుతూ 50 ఏళ్లు గడపడం ఆనందంగా వుంది. రాజకీయాల్లోకి ఒక సేవాభావంతో వెళ్లాను. అప్పటి ఇప్పటికీ రాజకీయాల్లో చాలా మార్పులు వచ్చాయి. ఇప్పుడున్న పరిస్థితిలో అటు డైవర్ట్ కావడం కరెక్ట్ కాదు. ఏ ప్రభుత్వమైన సినీ పరిశ్రమకు తగిన గౌరవం, ప్రాధాన్యత ఇవ్వాలని కోరుకుంటాను.

# తగ్గేదే లే అంటున్న రకుల్

రకుల్ ప్రీత్ సింగ్- జాకీ భగ్నానీ వివాహంతో ఒకటి కాబోతున్న సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 22న ఈ ప్రేమ జంట వివాహ బంధంతో ఒకటి కాబోతుంది. గోవాలో డెస్టినేషన్ వెడ్డింగ్ కి సన్నాహాలు జరుగుతున్నాయి. ఆ రకంగా 2024 ఏడాది ఆరంభంలో పెళ్లి బంధంతో ఒకటి కాబోతున్న తొలి జోడీగా రకుల్-జాకీ నిలిచారు. ప్రేమ బంధాన్ని పెళ్లి వరకూ తీసుకెళ్తారా? డేటింగ్ తోనే సరిపెడతారా? అని ఎన్నో సందేహాలు తెరపైకి వచ్చిన అన్నింటికి పెళ్లి తో ఫుల్ స్టాప్ పెట్టేయడం అభిమానుల్ని ఆనందాన్ని ఇస్తుంది. రకుల్ కి మునుపెన్నడు ఎలాంటి ఎఫైర్లు లేవు. కనీసం గాసిపు కూడా తెరపైకి రాలేదు. జీవితంలో ఒకరినే ప్రేమించింది..అతన్నే ఇప్పుడు పెళ్లి చేసుకోవడం పట్ల అభిమానులు అంతా ఆమెని హర్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో రకుల్ పెళ్లి తర్వాత సినిమాలు చేస్తుందా? లేదా? అన్నది కొందరిలో సందేహంగా మారింది.



వృత్తిని..వ్యక్తిగత జీవితాన్ని వేరు చేసి చూస్తుందా? రెండింటినీ బ్యాలెన్స్ చేస్తుందా? అందుకు నిర్మాతగా జాకీ ఒప్పుకుంటాడా? అన్న సందేహాలు తెరపైకి వస్తున్నాయి. తాజాగా వాటన్నింటిపై రకుల్ క్లారిటీ ఇచ్చేసింది. ఓ ఇంటర్వ్యూలో ఈ సందేహాలన్నింటిని రకుల్ ముందు కు తీసుకెళ్లేసరికి ఆమె కుండ బద్దలు కొట్టినట్లు సమాధానం ఇచ్చేసింది. పెళ్లి తర్వాత కూడా నేను సినిమా ల్లో కొనసాగాలనుకుంటున్నాను. అందరి అంగీకారంతోనే ముందుకు వెళ్తాను. వివాహం తర్వాత వృత్తిలో కొనసాగడం అన్నది కొత్త అనుభూతినిస్తుందని నేను భావిస్తున్నాను. ఎవరి వృత్తుల్లో వారు యధా విధిగా కొనసాగడంలో తప్పేముంది. ప్రేక్షకుల్ని అలరించాలని తెరమీదకు వస్తున్నాం. అందుకు పెళ్లి అడ్డంకి కాదు' అని చెప్పుకొచ్చింది. దీంతో రకుల్ వివాహం తర్వాత యాధావిధిగా వృత్తిలో కొనసాగుతుందని తెలుస్తుంది. భాగస్వామి జాకీ భగ్నానీతో విషయంలో మంచి అండర్ ఉన్నట్లు కనిపిస్తోంది. జాకీ కావడంతో రకుల్ ని అన్ని అర్దం చేసుకునే ఉంటుంది.

# 20న మొగల్తూరులో రెబల్ స్టార్ కృష్ణంరాజు గారి జయంతి వేడుకలు




రెబల్ స్టార్, కేంద్ర మాజీ మంత్రివర్యులు స్వర్గీయ కృష్ణంరాజు గారి జయంతి వేడుకలు ఈ నెల 20వ తేదీన మొగల్తూరులో నిర్వహించనున్నారు. కృష్ణంరాజు గారి సతీమణి శ్యామలా దేవి, కూతురు ప్రసీద, ప్రభాస్ ఈ వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ అందే బాపన్న కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబోతున్నారు. ఈ వైద్య శిబిరం కృష్ణంరాజు గారు, డాక్టర్ వేణు కవర్తపు ట్రస్టీలుగా ఉన్న యూకే ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరగనుంది. ఈ వైద్య శిబిరంలో జుబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రి నుంచి డాక్టర్ శేషబత్తారు, భీమవరంలోని వర్మ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ నుంచి డా.వర్మ పాల్గొంటారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో డయాబెటిస్ తో బాధపడుతున్న స్థానిక ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు, మెడిసిన్స్, చికిత్స అందిస్తారని శ్యామలాదేవి తెలిపారు. మొగల్తూరుతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరం సేవలను ఉపయోగించుకోవాలి ఆమె సూచించారు. ఈ సందర్భంగా శ్యామలాదేవి మాట్లాడుతూ కృష్ణం రాజు గారి జయంతి వేడుకలను ఆయనకు ఎంతో ఇష్టమైన మొగల్తూరులో చేస్తున్నాం. ఈ సందర్భంగా శ్రీ అందే బాపన్న కళాశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నాం. ఈ శిబిరానికి విదేశాల నుంచి పలువురు వైద్యులు వస్తున్నారు. ఇక్కడి ప్రజలంతా ఈ వైద్య శిబిరం సేవలు వినియోగించుకోవాలి. పేదలకు వైద్య సేవలు అందాలని ఆయన ఎప్పుడూ కోరుకునేవారు. నేను, ప్రసీద, బాబు ప్రభాస్ ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేయిస్తున్నాం. సుమారు వెయ్యి మంది దాకా ఈ వైద్య శిబిరానికి వస్తారని ఆశిస్తున్నాం. అని చెప్పారు.



# 26న 105 మినిట్స్

హన్సిక హీరోయిన్ గా రాజు దుస్సా దర్శకత్వంలో రుద్రాన్ష్ సెల్యులాయిడ్స్ మరియు మాంక్ ఫిలిమ్స్ సంయుక్తంగా బొమ్మక్ శివ నిర్మాతగా వస్తున్న సినిమా 105 మినిట్స్. గతంలో విడుదలైన మోషన్, పోస్టర్ థీమ్ సాంగ్ కి మంచి స్పందన లభించగా ఇప్పుడు విడుదలైన ట్రైలర్ సినిమా పైన అంచనాలను పెంచేస్తోంది. వినూత్న రీతిలో హన్సిక సినిమాలో చేసిన అదే క్యారెక్టర్ గెటప్ లో స్టేజ్ పైకి వచ్చి ట్రైలర్ ని రిలీజ్ చేయడం చాలా కొత్తగా అనిపించింది. ఒకే క్యారెక్టర్ని ఒకే షాట్లో చిత్రీకరించబడిన మొట్టమొదటి ఎక్స్పరిమెంటల్ చిత్రంగా 105 మినిట్స్ సినిమా నిర్మించారు. ఇవాళ పనోరమ స్టూడియో ద్వారా ట్రైలర్ రిలీజ్ చేయగా జనవరి 26న సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. దర్శకుడు రాజు దుస్సా మాట్లాడుతూ : మొట్టమొదటిసారిగా దర్శకత్వం వహిస్తున్న నన్ను నమ్మి కంటెంట్ ని నమ్మి ఈ సినిమాని నిర్మించడానికి ముందుకు వచ్చిన నిర్మాత బొమ్మక్ శివ గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు. ఈ కథను హన్సిక గారి దగ్గర తీసుకెళ్లినప్పుడు ఒప్పకుంటారా లేదా అనే ఒక కన్ఫ్యూజన్ ఉంది. కానీ కథ వినగానే సింగిల్ సెట్టింగ్లో నేను సినిమా చేస్తున్నానని ఒప్పకున్నారు. నన్ను నమ్మి ఈ కథను నమ్మి ఈ సినిమా చేసిన హన్సిక గారికి కృతజ్ఞతలు. అలాగే మాంక్ ఫిలిమ్స్ సుమన్ గారు కలవడం సినిమా ఇంకా ముందుకు పరిగెడుతోంది. జనవరి 26న ఈ సినిమాని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తున్నాం. ప్రేక్షకుల సినిమాను చూసి మమ్మల్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాను అన్నారు. హీరోయిన్ హన్సిక మాట్లాడుతూ : 105 మినిట్స్ సినిమా రిలీజ్ అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది ఒక కంప్లీట్ ఎక్స్పరిమెంటల్ ఫిలిం. 34 నిమిషాల షాట్ ని సింగిల్ టేక్ లో చేయడం అనేది నాకు ఒక కొత్త ఎక్స్పీరియన్స్ లా అనిపించింది. 8 రోజులు రిహార్సల్స్ చేసిన షార్ట్ అది. ఇలాంటి ఎక్స్పరిమెంట్స్ సినిమాలు ఎన్నో ఉన్నాయి. ఈ మూవీకి నన్ను సెలెక్ట్ చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. జనవరి 26న రిలీజ్ అవుతున్న మా సినిమాను ప్రేక్షకులు చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.